వార్త

ఆదివారం

5 మే, 2024





# రసాలూరే మధురసాలు!



# 'విశ్వంభర'లో విజయశాంతి?



మెగా స్టార్ చిరంజీవి కథానాయకుడుగా యంగ్ దర్శకుడు వశిష్ట 'విశ్వంభర' అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో త్రిష హీరోయిన్‌గా నటిస్తోంది. అయితే ఈ చిత్రంలో మరో సీనియర్ హీరోయిన్ కూడా నటించే అవకాశం ఉన్నట్లు సమాచారం. కథ ప్రకారం సెకండ్ హాఫ్‌లో వచ్చే ఈ పాత్ర చాలా కీలకమైందని, ఆ పాత్ర కోసం నిర్మాతలు విజయశాంతిని తీసుకునే ఆలోచనలో వున్నట్లు తెలుస్తోంది. గతంలో చిరంజీవి-విజయశాంతి కలయికలో ఎన్నో సూపర్ హిట్ చిత్రాలు వచ్చాయి. యువి క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా జనవరిలో విడుదల కానుంది.

## తారాతీరం

# కిశోర్ బి దర్శకత్వంలో ధనుష్!



శర్వానంద్-ప్రియాంక అరుళ్‌మోహన్ హీరో, హీరోయిన్లుగా 'శ్రీకారం' అనే సినిమా తీశాడు దర్శకుడు కిశోర్ బి. అయితే తాజాగా తమిళ హీరో దనుష్‌తో కిశోర్ బి ఓ సినిమా చేయబోతున్నట్లు వార్తలు వినిపించాయి. ధనుష్‌కి కిశోర్ బి కథ చెప్పాడనీ, ధనుష్ ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో ధనుష్ క్యారెక్టరే మెయిన్ హైలైట్‌గా ఉండనున్నట్లు తెలుస్తోంది.
దిల్ రాజు ఈ చిత్రాన్ని తన బ్యానర్‌లో నిర్మించనున్నారు. ధనుష్ తన కొత్త ప్రాజెక్ట్ పూర్తి కాగానే ఈ సినిమా మొదలు పెట్టనున్నట్లు సమాచారం.

ఆదివారం వార్త
5 మే, 2024

## మంచి ముత్యాలు

భగవంతునికై లేచి నిలబడు.
ప్రపంచమేమైనా కానివ్వు. రాజీపడవద్దు.

- స్వామి వివేకానంద

## విషయ విశేషం


ఖరీదైన సిల్కీ చికెన్... 4

'సంఘీ'భావం....5

అసెంబ్లీ ఎన్నికల్లో కరోనా అజెండా

కవర్ స్టోరీ..6

రసాలూరే మధురసాలు!

అశ్లీల బెదిరింపుల వలలో పడకుండా...10

ఈవారం కవిత్వం..12

నిశ్శబ్దంగా మండటం నేర్చుకో!

కెరీర్‌లో సక్సెస్ సాధ్యమే..14

కథ.. 20

జీవన సాఫల్యం

సాహిత్యం..23

సామెత లేని భాష ఆమెత లేని ఇల్లు

పంటినొప్పి-దేశభక్తి...24

సమస్యలను తొలగించే సుబ్బరాయుడు...26

పెద్దవాడు ఎటువైపు ఉండాలి?...29

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..


## తాజా వార్తలు

### బిడ్డను కంటే లక్షల బోనస్



పిల్లల్ని కంటే తల్లిదండ్రులకు జీతంతో కూడిన సెలవులు ఇవ్వడం అన్నిచోట్లా ఉన్నదే. దక్షిణ కొరియాకి చెందిన సంస్థ బూయాంగ్ గ్రూపు మరొకడుగు ముందుకేసి తన సిబ్బందికి ఏకంగా రూ.62లక్షల నగదు (కొరియా కరెన్సీలో వంద మిలియన్ వన్లు) బోనస్‌గా చెల్లిస్తానని ప్రకటించింది. ఎంతమంది పిల్లల్ని కంటే అన్నిసార్లు ఇంత మొత్తం ఇవ్వనుంది. ఎందుకలా అంటే గత కొంతకాలంగా కొరియాలో యువత కెరీర్ యావలో పడి పిల్లల్ని కనడానికి ఇష్టపడటం లేదట. ముఖ్యంగా మహిళలు పిల్లల కోసం కెరీర్‌ను వదులుకోవడానికి సిద్ధంగా లేరు. పిల్లల్ని పెంచడానికి అయ్యే ఖర్చు కూడా మరొక కారణం. దాంతో సంతాన సాఫల్యత రేటు (0.72) బాగా పడిపోయింది. ఇది ఇలాగే కొనసాగితే ఈ శతాబ్దం చివరికల్లా దేశజనాభా సగానికి తగ్గిపోతుందట. దాంతో కంపెనీలు ఒకదానితో ఒకటి పోటీపడి మరీ పిల్లల్ని కనే ఉద్యోగులకు బోనస్‌లు ప్రకటిస్తున్నాయి.

### నొప్పిని తగ్గించే బొమ్మలు



చిన్నారులకు జ్వరం వచ్చినా దెబ్బ తగిలినా వాళ్లను ఒప్పించి మందులివ్వడమే కాదు, శరీర ఉష్ణోగ్రత తగ్గడానికి తలపైన తడి గుడ్డనూ ఉంచలేం, వాపు మీద వేడినీళ్లతో కాపడాన్నీ పెట్టలేం. అది దృష్టిలో ఉంచుకుని పిల్లలకు నచ్చేట్లు బోలెడన్ని నొప్పిని తగ్గించే వస్తువులూ మార్కెట్లోకి వస్తున్నాయి. 'ఫోమీ కిడ్స్ ఫన్ పెయిన్ రిలీవింగ్ హాట్ అండ్ కోల్డ్ ప్యాక్', 'హాలో కిడ్స్ ఫన్ పెయిన్ ఐస్ ప్యాక్' పేర్లతో దొరికే ఈ ప్యాకులూ అలాంటివే. ఏనుగు, సింహం, పాండాలాంటి జంతువుల బొమ్మలూ రకరకాల కార్టూన్ పాత్రల చిత్రాలతో చూడ్డానికి భలేగా ఉంటాయి. చల్లదనం కోసం ఫ్రిజ్‌లో, వెచ్చదనం కోసం వేడినీళ్లలో పెట్టుకుని అవసరమైన చోట వాడుకోవచ్చు. బొమ్మలతో ఉండే ఈ ప్యాకుల్ని చూస్తే పిల్లలూ వద్దని మారాం చేయరు.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com



# ఖరీదైన సిల్కీ చికెన్

**కోడికో** ధర, పుంజుకో రేటు ఉండటం తెలిసిందే. వాటిని వండినప్పుడు రుచిలోనూ తేడా ఉంటుందని చెప్పేస్తారు చికెన్ ప్రియులు. అదేవిధంగా నాటుకోడి, బ్రాయిలర్, కడక్‌నాథ్ ఇలా కోళ్ల వెరైటీలూ చాలానే ఉంటాయి. ఆ జాబితాలో కొత్తగా సిల్కీచికెన్ కూడా చేరిందిప్పుడు. సుతిమెత్తని రెక్కలతోను పలు రంగుల్లోనూ ఉండే ఈ బొచ్చుకోళ్లు భలే ముద్దుగా ఉంటాయి. చూడగానే ఆకర్షించే గుణమున్న ఈ సిల్కీకోళ్లను ఇళ్లలో స్థలున్నవారూ, ఫామ్‌హౌస్‌లున్నవారూ ఎంచుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. అలాంటివాళ్లకోసమే ఈ సిల్కీ చికెన్‌ను పెంచి అమ్మేస్తున్నారు కొందరు. సుమారు మూడువేల అయిదువందల నుంచి అయిదువేల రూపాయల వరకూ పలుకుతున్న జత కోళ్లు రావడానికి ఫ్యాన్సీ రకమే అయినా వీటికంటూ కొన్ని ప్రత్యేకతలూ ఉన్నాయి.

## ఎక్కడిదీ కోడి

సిల్కీ/ఫఫ్పీ/బాంటమ్ చికెన్‌గా పిలిచే ఈ కోడి చైనాలో పుట్టిందని చెబుతారు. దీని రెక్కలు ముట్టుకోవడానికి మెత్తగా ఉండి నలుపు, నీలం, లావెండర్, గోధుమ, ఊదా వంటి రంగుల్లో వస్తాయి. నిజానికి ఈ కోళ్లు ఇలా రంగుల్లో వస్తున్నా వీటి మాంసం, ఎముకలు మాత్రం నలుగురంగులో ఉంటాయి. సాధారణంగా కొన్ని రకాల కోళ్లు ఇతర పక్షుల గుడ్లను పొదగడానికి ఇష్టపడవు. కానీ ఈ సిల్కీచికెన్ మాత్రం అన్నిరకాల పక్షుల గుడ్లనూ పొదిగేస్తాయట. మరీ వేడి లేదా చల్లని వాతవరణం కాకుండా గది ఉష్ణోగ్రతను తట్టుకునే శక్తి ఈ కోళ్లకు ఉంటుంది. దాదాపు తొమ్మిదేళ్ల జీవించడం, వీటిని పెంచడమే సులువు కావడం, ఎగరకపోవడం, ఒళ్లంతా ఒకటి లేదా రెండు మాత్రమే కనిపించడం తదితర అంశాలను పరిగణించే చాలామంది ఈ కోళ్లను తెచ్చుకునేందుకు ఇష్టపడుతున్నారు.

## ఆరోగ్యానికీ మేలు చేసేలా

ఈ కోడిని పెంచుకునేవారు కొందరైతే దీని మాంసాన్ని తినాలనుకునేవారు మరికొందరు. నిజానికి ఈ కోడి మాంసంలో పోషకాలు ఎక్కువ. అందుకే ఒకప్పుడు చైనీయులు..కొన్ని రకాల అనారోగ్యాలను నయం చేసేందుకు ఈ చికెన్ సూప్‌ను తాగేవారట. చైనాలో బాలింతలు ఈ చికెన్‌తో చేసిన పదార్థాలు తినడం వల్ల త్వరగా కోలుకుని ఆరోగ్యంగా తయారవుతారనీ నమ్మేవారట. అందుకే కొన్ని వందల సంవత్సరాల క్రితం ఈ కోడి ఎముకల పొడిని మందుల తయారీలో ఉపయోగించేవారట. ఇక, వంద గ్రాముల సిల్కీ చికెన్‌లో దాదాపు ఇరవై గ్రాముల మాంసకృత్తులు, మూడుగ్రాముల కొవ్వు, 121 కెలోరీలు ఉంటాయి. ఈ కోడి మాంసం నల్లగా ఉండటం వల్ల పోషకాలు ఎక్కువగా ఉంటాయనీ, రోగనిరోధకశక్తిని పెంచడంతోపాటు కండరవృద్ధికీ తోడ్పడుతుందనీ అంటారు. అందుకే చైనీయులతోపాటు జపనీయులూ, కొరియన్లూ, మలేషియన్లూ వంటకాల్లో ఈ చికెన్‌ను ఎక్కువగా వాడతారు. అన్నింటినీ మించి ఈ కోళ్లలో కార్నోసైన్ అనే పదార్థం ఎక్కువ మోతాదులో ఉంటుంది. సహజ పైప్టైడ్‌గా పిలిచే ఈ కార్నోసైన్ మధుమేహాన్ని అదుపులో ఉంచుతుందట. ఈ అంశాలన్నీ పరిగణించే వీటి ధర కూడా కాస్త ఎక్కువ అంటున్నారు వీటి అమ్మకందార్లు.





'సంఘీ' భావం



# అసెంబ్లీ ఎన్నికల్లో కరోనా అజెండా

ఈ సారి జరుగుతున్న ఎన్నికల్లో కరోనా ప్రస్తావన కీలకంగా మారింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థులు కరోనా సమయాన్ని గుర్తుకు చేస్తూ తాము చేసిన సేవలను గుర్తించాలని కోరుతున్నారు. మరికొందరు కరోనా కారణంగా ఆశించిన మేరకు అభివృద్ధి చేయలేకపోయామని, పరిస్థితిని అర్థం చేసుకుని సహకరించాలని కోరుతున్నారు. సాధారణ ఎన్నికలు 2019లో జరిగాయి, ఎన్నికలు జరిగిన మరుసటి సంవత్సరమే కరోనా తాండవించింది. దీనితో సామాన్యుల జనజీవనాలు తారుమారు అయ్యాయి. సుమారు రెండు సంవత్సరాల పాటు ప్రజలు సాధారణ జీవనం గడపలేకపోయారు, దీనికి తోడు ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది. అయిదేళ్ల పాలనలో రెండేళ్లు వృథాగా గడిచిపోయాయి. ఆ తరువాత కూడా పూర్తి స్థాయిలో కోలుకోవడానికి మరో సంవత్సరం పట్టింది. అయితే ఈ సమయంలో కొందరు ఎమ్మెల్యేలు, ఎంపీలు కరోనాకు భయపడి ప్రజల ముందుకు రాలేదు. మరికొందరు కరోనా సమయంలో ప్రజలను ఆదుకోవడానికి శ్రమించారు. ప్రజలకు ఉచితంగా ఆహారాన్ని, కిరాణా సామాగ్రిని అందించారు. బియ్యం బస్తాలు ఉచితంగా అందించారు. మరికొన్ని ప్రాంతాల్లో ఆర్థికంగానూ సహాయపడ్డారు. ప్రజలు కష్టాలో ఉన్నప్పుడు తాము వారికి అండగా ఉంటామన్న సందేశాన్ని ఇవ్వగలిగారు. ప్రస్తుతం ఈ అంశం ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. తమపై పోటీ చేస్తున్న అభ్యర్థి కరోనా సమయంలో ఎక్కడ ఉన్నాడని వారు ప్రశ్నిస్తున్నారు. తాము ప్రాణాలకు తెగించి ప్రజల ముందుండి సేవలను అందించామని, కరోనాతో వందలాది మంది చనిపోతున్నా తాము భయంతో వెనుకాడలేదని పేర్కొంటున్నారు. విపత్తులు, ఇబ్బందులు కలిగే సమయియంలో అందు బాటులో లేని నేతలకు ఓట్లు వేయవద్దని వారు ప్రకటనలు చేస్తున్నారు. ప్రధానంగా ఇంటింటి ప్రచారం చేస్తున్న సమయం లో ఈ విషయాలను ప్రస్తావిస్తున్నారు. కరోనా సమయంలో కొన్ని కాలనీలను మూసివేయడం జరిగింది. అక్కడి ప్రజలకు బయటకు రాకుండా బారికేడ్లు కట్టారు, ఈ సమయంలో పాలు, ఇతర నిత్యావసర వస్తువులకు ఇబ్బందులు కలిగాయి. పెద్ద సంఖ్యలో కంటైన్మెంట్ జోన్‌లను ఏర్పాటుచేసి కరోనా వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకున్నారు. ఈ సమయంలో కొందరు ప్రజాప్రతినిధులు అధికారుల అనుమతితో లోనికి ప్రవేశించి కాలనీవాసులకు కావల్సిన సరుకులు అందించారు. కరోనా బారిన పడిన వారికి వైద్య సహాయం, ఆర్థిక సహకారాన్ని అందించారు. ప్రస్తుతం ఈ విషయాల గురించి అభ్యర్థులు ఓటర్ల వద్ద ప్రస్తావిస్తున్నారు. ప్రత్యర్థులు కరోనాకు భయపడి ఇంటి నుంచి బయటకు రాలేదని, ప్రజల సమస్యలు పట్టించుకోలేదని వారు చెబుతున్నారు. ప్రస్తుతం అలాంటి నేతలు ఎన్నికల ప్రచారంలో ఓటర్ల వద్దకు వచ్చి ఓట్లు అభ్యర్థిస్తున్నారని, వారికి ఈసారి డిపాజిట్లు కూడా రాకుండా ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని వారు చెబుతున్నారు. కష్టాల్లో ప్రజలను ఆదుకునే తమలాంటి వారికి పట్టం కట్టాలని కోరుతున్నారు. మరోపక్క కరోనా సమయంలో తాము ఆశించిన మేరకు అభివృద్ధి చేయలేకపోయామని ఓటర్ల ముందు అంగీకరిస్తున్నారు. 2019లో ఎన్నికలు జరిగిన మరుసటి సంవత్సరమే కరోనా వ్యాప్తి చెందింది. దీనితో సుమారు రెండు సంవత్సరాల పాటు అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడ్డాయి. ప్రజలు సాధారణ జనజీవనానికి రావడానికి మరో సంవత్సరం పట్టింది. తాము పూర్తి స్థాయిలో పనిచేయడానికి వీలు లేకపోయిందని, ఐదేళ్లలో మూడేళ్లు వృథా అయ్యిందని వారు పేర్కొంటున్నారు. అయితే రెండేళ్లలో అభివృద్ధిని చేయగలిగామని చెబుతున్నారు. కరోనా లేకపోతే తాము మరింత అభివృద్ధి చేసి చూపించే వారమని పేర్కొంటున్నారు. కరోనా పరిస్థితులు అర్థం చేసుకుని ఈసారి కూడా తమకు పట్టం కట్టాలని సిట్టింగ్ ఎమ్మెల్యేలు అభ్యర్థిస్తున్నారు. మరో అవకాశం ఇస్తే ఊహించని రీతిలో అభివృద్ధి చేసి చూపిస్తామని హామీలు గుప్పిస్తున్నారు. ప్రజలు కూడా కరోనా పరిస్థితులను గుర్తు చేసుకుంటున్నారు. భయానక పరిస్థితుల్లో తాము పడిన ఇబ్బందులు నెమరువేసుకుంటున్నారు. కరోనా వచ్చిన తరువాత అనేక వ్యవస్థలు కుప్పకూలాయి. పట్టణాలను వదిలి తిరిగి తమ గ్రామాలకు చేరుకున్నారు. ఇప్పటికీ వీరిలో చాలామంది తిరిగి పట్టణాలకు రాలేదు. ఉన్నత చదువులు చదివిన వారు. ఉపాధ్యాయులు. అధ్యాపకులు ప్రస్తుతం తమ వృత్తులను వదిలిపెట్టి వంశపారంపర్య వృత్తుల్లో నిమగ్నమయ్యారు. ఎన్నో షాపులు మూతపడ్డాయి. ప్రస్తుతం ఎన్నికల సమయంలో ఆ పరిస్థితులను గుర్తు చేసుకుంటున్నారు. కరోనా సమయంలో తమను ఆదుకోని నేతలకుఎందుకు ఓట్లు వేయాలన్న దిశగా కొందరు ఓటర్లు ఆలోచిస్తున్నారు. ఓటర్ల మనోభావాలను గుర్తించిన అభ్యర్థులు కరోనా అంశాన్ని బలంగా తీసుకువెళ్లడానికి ప్రయత్నిస్తున్నారు. సాధారణంగా ప్రతి ఎన్నికల్లో హామీలు కీలక పాత్ర పోషిస్తాయి. అయితే రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా అనూహ్యంగా కరోనా అంశం తెరపైకి వచ్చింది. ఈ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటముల్లో కరోనా అంశం కూడా కీలక పాత్ర పోషించే అవకాశం కనిపిస్తోంది. ఆనాడు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన కరోనా ప్రస్తుతం అభ్యర్థుల విజయావకాశాలపై ప్రభావం చూపిస్తోంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

# రసాలూరే మధురసాలు!

కవర్ స్టోరీ

**షేక్ అబ్దుల్ వాహీం జాని**



**వేసవి వచ్చిందంటే చాలు.. అందరూ మక్కువగా ఆరగించే ఫలాలలో మామిడి పండుకు అత్యధిక ప్రాధాన్యతనిస్తారు. తీయని రుచులు, కమ్మని సువాసన, ఆకర్షణీయ మైన రంగు, శరీరానికి చక్కని పోషకాలు అందించే మామిడి పండు ఉంటే చాలు పచ్చడి మెతుకులైనా సరే పంచభక్షపరమాన్నంలా తినేస్తారు. వేడి అన్నం లో ముద్దపప్పు, నెయ్యి, ఆవకాయ వేసి తింటే ఆ రుచి అదరహో అంటుంది. సామాన్యుడికి సైతం అందుబాటులో ఉంటే మామిడి పండు తన అద్భుతమైన రుచుల తో అందరినీ ఆకట్టు కోవడం వల్ల ఇది ఫలాల రారాజుగా ప్రపంచ ప్రజల ప్రశంసందుకుంది.**

ఇది ప్రపంచంలోని ఉష్ణమండలాలలో పండే ప్రముఖమైన పండు. మామిడికి ఆదిమ స్థానం ఇండో బర్మా ప్రాంతమని భావిస్తారు. ఇది అక్కడి నుండి తూర్పు పడమర దేశాలకు వ్యాప్తి చెందింది. మామిడికాయ భారతదేశంతో పాటు ఫిలిప్పీన్స్, పాకిస్తాన్ దేశాల జాతీయ పండు. మామిడి చెట్టు బంగ్లాదేశ్ జాతీయ వృక్షం. భారతదేశంలో మామిడికి సుదీర్ఘమైన గొప్ప చరిత్ర ఉంది. అయిదువేల సంవత్సరాల క్రితం భారతదేశం లో మామిడిని మొదటిసారిగా పండించారని నమ్ముతారు. పురాతన కాలంలో మామిడిని 'రసాల', సహకార' అనే పేర్లతో పిలిచేవారు. మొగల్ సామ్రాజ్యంలో మామిడి పండ్లను మిక్కిలి ఇష్టపడేవారు. బాబర్ తన బాబర్ నామాలో మామిడిని ప్రశంసించాడు. అదే సమయంలో మొఘల్ చక్రవర్తి హుమయూన్‌పై విజయం సాధించిన తర్వాత షేర్ షా సూరి చౌసా మామిడి రకాల ఉత్పత్తికి బీజాలు వేశాడు. మొఘల్ చక్రవర్తుల ప్రోత్సాహం ఉద్యానవనంలో వేలాది మామిడి రకాలను అంటుకట్టడానికి చౌసా పండు దారి తీసింది. మధ్యయుగ కాలంలో మామిడిపండ్లు ఒక ప్రసిద్ధ వాణిజ్య వస్తువుగా మారి పర్షియా, అరేబియా, తూర్పు ఆఫ్రికాతో సహా అనేక ఇతర దేశాలకు ఎగుమతి చేయడం జరిగింది. పోర్చుగీస్‌వారు మామిడిని పశ్చిమ దేశాలకు పరిచయం చేశారు. ఎన్నోవేల సంవత్సరాల నుంచి ఉన్న మామిడి మన దేశంలోకి మాత్రం 16వ శతాబ్దంలో పోర్చుగీసు వారి పాలనా కాలంలో వచ్చినట్టు చరిత్ర చెపుతోంది. ఈ రుచికరమైన పండు మలయాళ పదం 'మాంగా'. అయితే పోర్చుగీస్‌వారు కేరళకు వచ్చినప్పుడు ఈ పదం 'మాంగో'గా మారింది.

మన దేశంలో మామిడి అయిదు వేలఏళ్ల క్రితమే సాగులో ఉందట. ఇక్కడి నుంచి మధ్య ప్రాచ్యం, తూర్పు ఆఫ్రికా, అమెరికాలకు దీన్ని వర్తకులు, రాజులు తీసుకెళ్లారు. సంస్కృతంలో ఆమ్ర అని పిలవబడిన మామిడి, కేరళ వాసుల మాంగా నుంచే ఇంగ్లీషులో మాంగో అయిందని చరిత్రకారుల అభిప్రాయం. చైనా యాత్రికులు హుయాన్‌త్సాంగ్, ఫాహియాన్ మన దేశపు మామిడి పండ్లను అద్భుతమని వర్ణించారు. మధ్య యుగ భారతదేశంలో ఇండో-పర్షియన్ కవి అమీర్ ఖుస్రో మామిడిని 'నాగ్జా తారిన్ మేవా హిందుస్థాన్' (హిందుస్థాన్ ఉత్తమ ఫలం) అని పేర్కొన్నాడు. అమీర్ ఖుస్రో మామిడి మీద ఏకంగా పద్యం రాసాడు. మామిడిని ఫకర్ ఏ గుల్షన్ అని పిలిచాడు. అంటే తోటకే మకుటం లాంటిదని అర్థం. ఢిల్లీ సుల్తాన్ అల్లావుద్దీన్ ఖిల్జీ ఆస్థానంలోనివారు మామిడి పండ్లను ఆస్వాదించారు. సుప్రసిద్ధ పార్శీ కవులైన ఇబన్ బటూటా, ఇబ్నుహూకల్ తమ రచనల్ల మామిడి పండ్లను వేనోళ్ల పొగడినవారే. భారతదేశాన్ని పాలించిన మొఘల్ చక్రవర్తి అక్బర్(1556-1605) బీహార్ దర్భంగా సమీపంలో లక్ష చెట్లతో కూడిన మామిడి తోటను అభివృద్ధి చేసినట్లు తెలుస్తోంది. జహంగీర్, షాజహాన్ చక్రవర్తులు లాహోర్, ఢిల్లీలో మామిడి తోటలను నాటాలని, మామిడి కాయలను ఉత్పత్తి చేయాలని ఆదేశించారు. సంస్కృత కవి కాళిదాసు మామిడి పళ్లను కీర్తించాడు. కాశ్మీరీ శాలువాలు, కాంచీపురం పట్టుచీరెలలో మామిడికాయలు కనిపిస్తాయి.

భారతదేశంలో పలురకాల మామిడి పండ్లను విపరీతంగా పండిస్తున్నారు. ఒక్కో రకం పండు ఒక్కో రుచితో పాటు ప్రత్యేకమైన ఆకృతిని, రంగును కలిగి ఉంటాయి. కొన్ని మామిడి కాయలు పచ్చగా ఉంటే, మరికొన్ని బంగారు వర్ణంతో మెరిసిపోతుంటాయి. ఇంకొన్ని ఎర్రని వర్ణంతో కనువిందు చేస్తాయి. భారతీయ మామిడి పండ్లను ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ఆదరిస్తారు. ప్రతి సంవత్సరం వేసవి ప్రారంభం కాగానే ప్రజలు మామిడి పండ్ల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. భారతదేశంలో పలు రాష్ట్రాలలో అనేక రకాల మామిడి పండ్లు పండుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా జరిగే మామిడి ఉత్పత్తిలో మన దేశంలో 60 శాతం దిగుబడి అవుతుంది. అత్యధికంగా 25 మిలియన్ టన్నుల మామిడిపండ్లు మన దేశంలో ఉత్పత్తి అవుతున్నాయి. దాదాపు 12 లక్షల హెక్టార్లలో పండిస్తూ మన దేశంలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిచింది. రుచికరమైన మామిడి పండ్లకు భారతదేశం ప్రసిద్ధి చెందడంతో ప్రపంచ వ్యాప్తంగా ప్రజాదరణ పొందింది. ఆసియా, ఆఫ్రికా, మధ్య అమెరికాలో కూడా ఇది ఎక్కువగా లభిస్తుంది. ప్రపంచంలోనే మామిడిని అత్యధికంగా ఎగుమతి చేసే దేశాలలో ఒకటిగా మన దేశం భాసిల్లుతోంది. 2022లో భాతరదేశం, ఇండోనేషియా, చైనా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, నెదర్లాండ్స్‌లకు 28 వేల మెట్రిక్ టన్నులకు పైగా ఎగుమతి చేసింది. ఆల్ఫోన్సో, కేసర్, తోతాపురి, బంగన్‌పల్లి మొదలైనవి భారతదేశం నుండి ఎగుమతి చేయబడే ప్రధాన రకాలు. కొన్ని మామిడి పండ్ల వల్ల ఆ ప్రాంతాలు ప్రసిద్ధి చెందిన చరిత్ర కూడా ఉంది. పండ్లలో మామిడి రారాజు అయితే, మామిడి పండ్ల రకాల్లో ఆల్ఫోన్సో రారాజు అని ప్రశంసలందుకుంది. మన దేశంలో వందల రకాల మామిడి పండ్లు దొరుకుతున్నాయి. వాటిలో కొన్నిటిని గురించి తెలుసుకుందాం..



**ఆమ్రపాలి:** ఆమ్రపాలి అనేది ఒక ప్రసిద్ధ మామిడి. దీనిని 1971లో న్యూఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వారు దశేరి, నీలం మామిడి రకాల మధ్య హైబ్రిడ్‌గా అభివృద్ధి చేశారు. ఈ మామిడి పండ్లు మధ్యస్థ పరిమాణంలో ఉంటాయి. కోణాల చివరతో దీర్ఘ చతురస్రాకార ఆకారం కలిగి ఉంటాయి. అవి పండినప్పుడు ప్రకాశవంతమైన బంగారు, పసుపు రంగుతో, పూల వాసనతో తీపి రుచిని కలిగి ఉంటాయి. భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన మామిడి రకాల్లో ఆమ్రపాలి ఒకటి. ఇవి





సాధారణంగా మే నుండి జూన్ వరకు అందుబాటులో ఉంటాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఆమ్రపాలి మామిడిని మంచి ధరతో విక్రయిస్తారు.

**మహారాష్ట్ర:** మన దేశంలోని మహారాష్ట్రంలో పండే అల్ఫోన్సో మామిడి చాలా ప్రసిద్ధి చెందింది. అల్ఫోన్సో మామిడి పండ్లు మహారాష్ట్రలోని కొంకణ్ ప్రాంతంలో ప్రధానంగా పండించే ఒక ప్రసిద్ధ మామిడి ఫలాలు. మహారాష్ట్రలోని పలు ప్రాంతాలలో అల్ఫోన్సో మామిడి పండ్లను పండిస్తారు. అల్ఫోన్సో డి అల్బ్కరక్ అనే పోర్చుగీసు జనరల్ పేరు ఈ మామిడికి పెట్టారు. దీన్ని కింగ్ ఆఫ్ మాంగో, హాపస్ అని కూడా పిలుస్తారు. మహారాష్ట్రలో కొంకణ్ తీరంతో పాటు రత్నగిరి జిల్లా, దేవగడ్ తాలూకా, రాయ్‌గఢ్ జిల్లా ఇత్యాది ప్రాంతాలు అల్ఫోన్సో మామిడిపండ్ల ఉత్పత్తికి ప్రసిద్ధి చెందాయి. దేవగడ్‌లో ఉన్న ఒక పొలంలో సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను ఉపయోగించి అల్ఫోన్సో మామిడిని పండిస్తున్నారు. ప్రపంచంలో అత్యంత డిమాండ్‌ను కలిగిన మామిడి అల్ఫోన్సో. ఈ మామిడికి అంతర్జాతీయంగా అనేక పురస్కారాలు రావడం విశేషం.

## తెలుగు రాష్ట్రాల్లో మామిడి

తెలుగు రాష్ట్రాల్లో రెండు లక్షల హెక్టార్లలో మామిడిని సాగు చేస్తూ 2.3 మిలియన్ టన్నుల పైబడి మామిడిని ఉత్పత్తి చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, గుంటూరు, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, చిత్తూరు, కడప ఇత్యాది అనేక ప్రాంతాలలో మామిడి విస్తారంగా పండిస్తున్నారు. ఇక్కడ బంగినపల్లి, సువర్ణరేఖ, నీలం కలెక్టర్, పంచదార కలవ, సింధూర, అరటి మామిడి, చిలుకముక్కు ఆకారంలో ఉండి తోతాపురిగా పిలిచే చ్తూరు మామిడి ఇత్యాది అనేక రకాల మామిడి పండ్లు లభిస్తాయి. కానీ ఆంధ్రుల అభిమాన ఫలం మాత్రం బంగినపల్లి. దీనికి తెలుగువారి మనసులో ప్రత్యేక స్థానం ఉంది. బనగానపల్లి అనేది కర్నూలు జిల్లాలో ఒక ఊరి పేరు. ఆ పేరు బంగినపల్లిగా మారింది. దీన్నే బెనిషన్, సఫేదా అని కూడా పిలుస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ మామిడి చాలా ప్రసిద్ధి చెందింది. దీనికి దీటుగా ఉలవపాడు మామిడికాయలు అద్భుత రుచితో అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఈ కాయలు చెట్టుకు పండితే తేనెను జుర్రుకున్నట్లు ఉంటాయి. బంగినపల్లి మామిడి పండ్లు సాధారణంగా ఏప్రిల్ నుండి జూన్ సమయంలో భారతదేశంలో విరివిగా లభిస్తాయి. మన దేశంలో ఉత్తమ మామిడి రకాల్లో ఒకటిగా బంగినపల్లిని పరిగణిస్తారు.

నాణ్యత, రుచి విషయంలో బంగినపల్లి మామిడి అనేక పురస్కారాలను అందుకుంది. కృష్ణా జిల్లా నూజివీడులో పండే రసాలు చాలా ప్రసిద్ధి చెందాయి. నూజివీడులోని సుబ్రమణ్యం మామిడి ఫామ్‌లో సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను ఉపయోగించి అధిక నాణ్యత గల బంగినపల్లి మామిడిని పండిస్తున్నారు. బంగినపల్లి మామిడికి కర్నూలు జిల్లా చాలా ప్రసిద్ధి చెందింది. కడపలో వెల్లూరు మామిడి ఫామ్, కర్నూలులోని అక్బర్ మామిడి ఫామ్‌లలో బంగినపల్లితో పాటు అల్ఫోన్సో, మాల్గోవా, రసాలు కూడా పండిస్తున్నారు. ఇమాం పసంద్ మామిడిని హిమాయత్, హిమాయుద్దీన్, హుమయున్ పసంద్ ఇత్యాది పేర్లతో పిలుస్తారు. ఇవి ఆంధ్ర, తమిళనాడులలో కనిపిస్తాయి. తెలంగాణలోని ఖమ్మం, మహబూబ్‌నగర్, మెదక్, కరీంనగర్, రంగారెడ్డి, ఆదిలాబాద్ ఇత్యాది అనేక ప్రాంతాలలో మామిడిని విస్తారంగా పండిస్తున్నారు.

**హర్యానా:** హర్యానాలో చౌసా, దశేరి, లాంగ్రా, ఫాజిలి ఇత్యాది నాలుగు రకాల మామిడిపండ్లు విరివిగా పండుతాయి. హర్యానాలోని రాటియా మార్కెట్‌లో లాంగ్రాతో పాటు అనేక రకాల పండ్లు అందుబాటులో ఉంటాయి. పల్వాల్ లోని శ్రీ రాధే కృష్ణ ఆగ్రో ఫార్మ్స్ నాణ్యమైన లాంగ్రా మామిడిపండ్లకు చాలా ప్రసిద్ధి చెందింది. యమునా నగర్‌లోని పంచవటి ఫామ్ లాంగ్రా మామిడి చెట్ల పెంపకం, పండించడంలో పేరొందింది. హిసార్‌లోని శ్రీ బాలాజీ ఫ్రూట్ కంపెనీ, కర్నాల్ సైతం లాంగ్రా మామిడికి చాలా ప్రసిద్ధి చెందాయి.



యెమెన్ దేశంలోని ఓ మామిడిచెట్టు

**ఉత్తరప్రదేశ్:** సదాబహార్ మామిడి అనేది ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో పండించే అంతగా తెలియని మామిడి రకం. 'సదాబహార్' అనే పదానికి హిందీలో 'శాశ్వతమైనది' అని అర్థం. ఈ మామిడి రకం చాలా కాలం నిల్వ ఉండే గుణాన్ని కలిగి ఉండటంతో ఈ పేరు పెట్టారు. సదాబహార్ తీయని రుచితో పాటు పీచు పదార్థాన్ని కూడా కలిగి వుంటుంది. చక్కెర శాతం తక్కువగా ఉండటం వల్ల మధుమేహ వ్యాధిగ్రస్తులు కూడా దీన్ని ఆరగిస్తుంటారు. హర్యానాలో వలే ఉత్తరప్రదేశ్‌లో ఆవిర్భవించిన అద్భుతమైన పండు లాంగ్రా. ఉత్తర భారతంలో హర్యానాలో లభించే మామిడి చౌసా. షేర్షా సూరి హుమయున్‌పై తన చౌసా యుద్ధ విజయాన్ని పురస్కరించుకుని ఆ పేరు పెట్టారట. చౌసా మామిడిపండ్లు సుగంధభరితంగా విటమిన్ సితో నిండి ఉంటాయి.

థాయ్‌లాండ్ మామికాయలు





ఫిలిప్పీయన్ మామిడిపండ్లు

మన దేశంలో తరచుగా మామిడి షేక్స్, స్మూతీస్, ఐస్‌క్రీములు తయారు చేయడానికి ఉపయోగిస్తారు. లాంగ్రా తాజాగా తినడం మంచిది. మన దేశంలో చాలా ప్రజాదరణ పొందిన పండు లాంగ్రా. లక్నో, సహరాన్‌పూర్ జిల్లాల్లో సదాబహార్, లాంగ్రా, దశేరి రకాల మామిడి లభిస్తుంది. ఈ ప్రాంతాలలో అతి పెద్ద పండ్ల మార్కెట్ ఉంది. లక్నో సమీపంలో మలిహాబాద్‌లో ఉన్న జైమల్ సింగ్ నర్సరీలో దశేరి, లాంగ్రా, సదాబహార్ మామిడి ఉత్పత్తి చేస్తున్నారు. లక్నోలో ఉన్న అన్వర్ రాటోల్ మ్యాంగో ఫామ్, బాద్ షా బాగ్‌లో అల్ఫోన్సో, మలిహాబాద్‌లో సఫేదా, సదాబహార్ పండిస్తున్నారు.

**హిమాచల్‌ప్రదేశ్:** హిమాచల్‌ప్రదేశ్‌లో ఆరు రకాల మామిడి పండ్లు దొరుకుతాయి. చౌసా, దశేరి, లాంగ్రా, అల్ఫోన్సో, కేసర్, పైరి రకాలు ఈ రాష్ట్రంలో ప్రసిద్ధి చెందాయి. ఈ రాష్ట్రంలో కూడా చౌసా మామిడి అందుబాటులో ఉంటుంది. చంబా జిల్లా చౌసా మామిడికి ప్రసిద్ధి చెందింది. వీటిని బనిఖేత్, భర్మౌర్ ప్రాంతాల్లో పండిస్తారు. ఉనా జిల్లాలోని సంతోష్‌గఢ్ పట్టణం, కాంగ్రా జిల్లాలోని నగ్రోటా బగ్వాన్ పట్టణం చౌసా మామిడికి ప్రసిద్ధి. ఉనాలోని కోట్ల గ్రామంలో అగ్రిమ్ మామిడి పెంపకం దారులు సేంద్రీయ పద్ధతుల ద్వారా చౌసా మామిడి పండిస్తు న్నారు.

**కర్ణాటక:** కర్ణాటక అల్ఫోన్సో, తోతాపురి, బంగినపల్లి, రాస్‌పైరి, నీలం, ముల్ గోవా వంటి మామిడి పండ్లు రకాలు లభిస్తాయి. అల్ఫోన్సో కింగ్ ఆఫ్ మ్యాంగో అయితే రాస్‌పురి, రాస్‌పైరిగా పిలిచే మామిడి క్వీన్ అని అంటారు. కర్ణాటకలో పండే ఈ రకాన్నే పెద్ద రసాలు అని కూడా పిలుస్తారు. రామనగర, చిక్కబళ్లాపూర్, కోలార్, తుంకూర్‌లలో ఇవి పండుతాయి. అల్ఫోన్సో అని కూడా పిలిచే బాదామి మామిడిని ప్రధానంగా కర్ణాటక రాష్ట్రంలో పండిస్తారు. ఆకృతి, రుచి పరంగా అల్ఫోన్సో మామిడిని పోలి ఉంటాయి. రాస్పూరి, బాదామి మామిడి పండ్లు ఏప్రిల్ నుంచి జూన్ వరకు సీజన్‌లో లభిస్తాయి. కర్ణాటకలో ఇవి ప్రధాన మామిడి రకాలు. ఈ మామిడి రకాలు భారతదేశంలోని ఉత్తమ మామిడి పండ్లలో ఒకటిగా పరిగణిస్తారు. ప్రతి ఏడాది ఈ ఫలాల కోసం ప్రజలు ఆత్రుతగా ఎదురు చూస్తుంటారు. బెంగళూరు మార్కెట్, మైసూరు నగరాలలో రాస్పూరి, బాదామి మామిడి అధికంగా లభిస్తాయి.

మాండ్య జిల్లాలో రసపురి, బాదామి మామిడికి ప్రసిద్ధి. బెంగళూరు సమీపంలో ఉన్న లాల్ బాగ్‌లో ప్రతీ ఏడాది వార్షిక మామిడి పండుగ జరుపుతారు. ఇక్కడ రాస్పూరి, బాదామి మామిడి విరివిగా లభిస్తాయి.

**తమిళనాడు:** తమిళనాడులోని కృష్ణగిరి జిల్లాలో మల్గోవా, ఇమామ్ పసంద్, అల్ఫోన్సో, బంగినపల్లి ఇత్యాది రకాలు పండిస్తున్నారు. ధర్మపురి జిల్లాలో సేంద్రీయ వ్యవసాయ పద్ధతులతో మాల్గోవా పండిస్తున్నారు. ఈరోడ్ జిల్లాలో ఆచి మామిడి ఫామ్‌లో అల్ఫోన్సో, నీలం, తోతాపురి ఇత్యాది రకాలు పండిస్తున్నారు. సేలం జిల్లాలోని విశాల్ మామిడి ఫామ్‌లో సహజ వ్యవసాయ పద్ధతులతో మాల్గోవా, కోయంబత్తూర్ జిల్లాలోని కళ్యాణి మామిడి ఫామ్‌లో మాల్గోవా, అల్ఫోన్సో, బంగినపల్లి, ఇమామ్ పసంద్ ఇత్యాది రకాలు పండిస్తున్నారు.

**బీహార్:** బీహార్ వాసులు కూడా మామిడి పండ్లను ఎంతగానో ఇష్టపడతారు. బాంబే గ్రీన్, చౌసా, దశేరి, ఫాజిలి, గుల్బకాస్, కిసేన్ బోగ్, హిమసాగర్, జర్దాలు, లాంగ్రా వంటి పండ్ల రకాలు బీహార్‌లో దొరుకుతాయి. జర్దాలు మామిడి అనేది బీహార్‌లోని భాగల్‌పూర్ జిల్లాలో ప్రధానంగా పండించే ప్రసిద్ధ మామిడి రకం. సాధారణంగా ఈ మామిడి 300 నుండి 500 గ్రాములు బరువు కలిగి వుంటాయి.

**గుజరాత్:** గుజరాత్‌లో ఎనిమిది రకాల మామిడి పండ్లను రైతులు పండిస్తారు. కేసర్, అల్ఫోన్సో, రాజాపురి, జామాదార్, తోతాపరి, నీలమ్, దశేరి, లాంగ్రా ఇత్యాది మామిడి పండుతాయి. తలాలా పట్టణాన్ని గుజరాత్ రాష్ట్ర మామిడి రాజధానిగా పిలుస్తారు. ఇక్కడ టామీ అట్కిన్స్ మామిడి చాలా ప్రసిద్ధి చెందింది. ఇందులో చక్కెర పది శాతాన్ని మించి ఉండని కారణంగా మధు మేహ వ్యాధిగ్రస్తులు నిర్భయంగా ఆరగిస్తారు. ఇంకా గుజరాత్‌లోని జునాగఢ్, సూరత్, బరూచ్ జిల్లాలోని అంకలేశ్వర్, ఝగాడియా ప్రాంతాలలో నాణ్యమైన టామీ అట్కిన్స్ మామిడిని పండిస్తున్నారు. గుజరాత్‌లోని గిర్ ప్రాంతంలో పండించే కేసర్ రకాన్ని మామిడి పండ్ల రాణిగా పిలుస్తారు. జునాగఢ్ నవాబులు కేసర్ మామిడిని మక్కువగా తినేవారు. ఈ మామిడి తీపి, కస్తూరి రుచిని కలిగి పరిమళ భరితంగా ఉంటుంది. 1930కు పూర్వం నుండే కేసర్ మామిడిని ఇక్కడ పండిస్తున్నారు. అసాధారణ రుచిని కలిగివున్న కేసర్ మామిడి గుజరాత్ సాంస్కృతిక వారసత్వంలో భాగంగా ఇమిడిపోయింది. కేసర్ మామిడి జునాగఢ్, తలాలా, భావ్‌నగర్ మార్కెట్లలో విరివిగా లభిస్తుంది. ప్రతీ ఏడాది జునాగఢ్‌లో జరిగే అంతర్జాతీయ మామిడి పండుగలో కేసర్‌కు ప్రత్యేక స్థానం ఉంటుంది.

**పశ్చిమ బెంగాల్:** ఫాజిలి, గుల్బాకాస్, హిమ్‌సాగర్, కిషోన్‌భోగ్, లంగ్రా, బాంబే గ్రీన్ వంటి మామిడి రకాలకు పశ్చిమ బెంగాల్లో మంచి గిరాకీ ఉంది. హిమసాగర్ మామిడి నాడియా, ముర్షిదాబాద్, మాల్దా, హుగ్లీ ప్రాంతాల్లో పండుతుంది. మన దేశంలో లభించే నాణ్యమైన మామిడిలో లక్ష్మణభోగ్ ఒకటి. దీంతో చట్నీలు, ఊరగాయలు, స్మూతీస్ వంటి వంటకాలు చేస్తారు. పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా జిల్లాలో లక్ష్మణభోగ్ మామిడిపండ్లకు ప్రసిద్ధి చెందింది.



మాల్దాలోని కృష్ణేందు ప్రమాణిక్ మామిడి తోటలో లక్ష్మణభోగ్ మామిడితో పాటు హిమసాగర్, లాంగ్రా రకాలను కూడా పండిస్తున్నారు. పంజాబ్‌లో చౌసా, దశేరి, రాజస్థాన్‌లో బాంబే గ్రీన్, చౌసా, లాంగ్రా వంటి మామిడి పండ్లకి గిరాకీ ఎక్కువ. మధ్యప్రదేశ్‌లో అల్ఫోన్సో, బాంబే గ్రీన్, దశేరి, ఫాజిలి, లాంగ్రా, నీలం వంటి రకాలకు విపరీతమైన గిరాకీ ఉంది. రుమాని, మల్గుబా, గులాబ్‌ఖాస్, ఆలంపుర్ బెనిష, ఫాజ్లి, బ్లాక్ రోజ్, వనరాజ్, కిషన్, భోగ్, మంకురాద్(గోవా), మాల్దా, పానకాలు వంటి రకాలతో పాటు ఆలంపూర్, చెరుకురసం, బనేషాన్, బంగలోర్, ఒలౌర్, మల్‌గోవా, సణేదా, నీలేషాన్, సింధు, రత్న... ఇలా చెప్పుకుంటూ పోతే మామిడిలో వందల రకాలు ఉన్నాయి. కారాబావో మామిడిలో 14 రకాల జాతులు ఉన్నాయి. కారాబావో



మామిడిని ఫిలీప్పన్స్ మామిడి, మనీలా మామిడి అని కూడా పిలుస్తారు. ఇది ఫిలిప్పీన్స్‌కు చెందినది. వివిధ రకాల తీపి రుచులను ఇది కలిగి ఉంటుంది. ఆ కారణంగా అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందింది. ప్రపంచంలో అత్యంత తీపి జాబితా గల పండుగా 1995లో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదైంది. పామర్ మామిడిపండ్లు ప్రపంచ వ్యాప్తంగా అత్యధికంగా పెరుగుతాయి. కెంట్ మామిడి దక్షిణ అమెరికా నుండి ఈక్వెడార్, పెరూ, మెక్సికోలలో ఉత్పత్తి అవుతుంది. ఫ్లోరిడా, హవాయి, కాలిఫోర్నియాలలో టామీ అట్కిన్స్ మామిడి అధికంగా ఉత్పత్తి అవుతుంది. హాడెన్ మామిడి పండ్లు యునైటెడ్ స్టేట్స్‌లో అత్యంత ప్రాచుర్యం పొందింది. చోక్ అనన్ మామిడి మన దేశంతో పాటు పాకిస్థాన్, బంగ్లాదేశ్, థాయ్‌లాండ్ దేశాలలో ఉత్పత్తి అవుతుంది. ఫ్రాన్సిస్ మామిడి కరేబియన్ దేశం హైతీకి చెందిన పండు.

## ప్రపంచంలోనే ఖరీదైన మామిడి

ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన మామిడి పండు పేరు మియాజాకీ. ఈ మామిడి కిలో రూ.2.75 లక్షలు ఉంటుంది. జపాన్‌లోని మియాజాకీ ప్రాంతంలో పండటం వల్ల దీనికి ఆ పేరు పెట్టారు. ఈ మామిడిని సూర్యుడి గుడ్డు(ఎగ్స్ ఆఫ్ సన్) అని కూడా పిలుస్తారు. ఖరీదైన మియాజాకీ మామిడిని పశ్చిమ బెంగాల్ సిలిగురిలో పండిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒడూరు నాగేశ్వరరావు అనే రైతు మియాజాకీ మొక్క నాటగా అది చెట్టుగా ఎదిగి 15 కాయలు కాశాయి. ఆ రైతుకు నాలుగు ఎకరాలపై వచ్చే ఆదాయం ఈ ఒక్క చెట్టు ద్వారా పొందడం విశేషం. మియాజాకీ ఒక్కో కాయ లక్ష రూపాయల చొప్పున 15 లక్షలు పొందడం విశేషం. అంతర్జాతీయంగా జరిగే మామిడి కాయల ప్రదర్శనా పండుగలో వందల రకాలు కనువిందు చేసినప్పటికీ మియాజాకీ చుక్కల్లో చంద్రుడిలా ప్రత్యేకతను చాటుకుంటుంది. ఇదే కోవకు చెందిన అతి ఖరీదైన మామిడి రకాలు ఇంకా అనేకం ఉన్నాయి.

## మామిడితో తినుబండారాలు

మామిడి పండ్లను చాలా వంటకాల్లో ఉపయోగిస్తారు. పుల్లని, పండని మామిడికాయలను పచ్చడి, ఊరగాయలు, పప్పులు, భారతీయ వంటకాల్లో ఇతర సైడ్ డిష్‌లలో ఉపయోగిస్తారు. మామిడి పండ్లతో ఆబ్‌షోలా, ఆమ్ పన్నా అనే వేసవి పానీయాన్ని తయారు చేస్తారు. మామిడికాయ గుజ్జును జెల్లీగా తయారు చేస్తారు. మామిడి లస్సీని దక్షిణ ఆసియా అంతటా వినియోగిస్తారు. జామ్‌లు, జెల్లీలు, మామిడి, తాండ్ర, ఐస్‌క్రీమ్, మామిడిని జ్యూస్‌లు, స్మూతీస్, జామ్, మురబ్బా, ఆమ్‌చూర్, ఫ్రూట్ బార్‌లు, మిల్క్‌షేక్‌లు, సలాడ్‌లు తయారు చేస్తారు. ఆమ్రాస్ అనేది మామిడి పండ్లతో చక్కెర కనీ, పాలతో చేసిన మందపాటి రసాన్ని చపాతీలు, పూరీలతో నంజుకుని తింటారు. ఇంకా మామిడితో పులిహోర, మామిడి వడలు, పానీయాలు, చికెన్ జతచేసి వండే వంటకాలు తయారు చేయవచ్చు.

## మేలు చేసే మామిడి

మామిడికాయ తినడం వల్ల ఉపయోగాలు ఉన్నాయి. మామిడిలో పీచు పదార్థం అత్యధికంగా ఉంటుంది. మామిడిలో విటమిన్ ఎ, విటమిన్ సి ఉంటాయి. మామిడి పండ్లలో కాపర్, ఐరన్, బీటా, కాల్షియం, జింక్, ఫోలేట్, విటమిన్ ఇ, బి వంటి పోషకాలు కూడా ఉన్నాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉన్నాయి. ఇవి రోగని రోధక శక్తిని పెంచుతాయి. మామిడిలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇది గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. మామిడి పండ్లలో ఫైబర్, పొటాషియం, విటమిన్లు వంటి పోషకాలు ఉంటాయి. ఇవి గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. ఇవి జీర్ణ వ్యవస్థకు చాలా మేలు చేస్తాయి. ఇది జీర్ణ ఎంజైమ్‌లను కలిగి ఉంటుంది. మామిడి పండ్లలో నీరు, డైటరీ ఫైబర్ అధికంగా ఉంటుం ది. ఇది మలబద్ధకం, విరేచనాలు వంటి సమస్యల నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. చర్మానికి చాలా మేలు చేస్తుంది. ఇది చర్మం ఆయిల్ ఉత్పత్తిని తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది ముడతలు, ఫైన్ లైన్స్ వంటి వృద్ధాప్య సంకేతాలను తగ్గిస్తుంది. మామిడిలో కరిగే ఫైబర్ ఉంటుంది. ఇది చాలా కాలం పాటు కడుపు నిండుగా ఉంచుతుంది. దీనివల్ల మీరు తక్కువ తినవచ్చు. ండ్లలో పొటాషియం, మెగ్నీషియం, విటమిన్ సి వంటి పోషకాలు ఉంటాయి. ఇవి రక్తపోటు స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి. ఇందులో ఉండే మెగ్నీషియం థైరాయిడ్‌కు సంబంధించిన సమస్యలను దూరం చేస్తుంది. మధుమేహం వంటి కొన్ని అనారోగ్య సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహా పైనే మామిడిని తినాలి. చాలా మంది మామిడి పండు తిన్న తర్వాత ఒక్కను డస్ట్‌బిన్‌లో వేస్తారు. అయితే మామిడి తొక్క ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. పీచు, యాంటీ ఆక్సిడెంట్లు, మొక్కల సమ్మేళనాలు, విటమిన్లు ఎ,సి,కె, ఫోలేట్, మెగ్నీషియం, కోలిన్, పొటాషియం వంటి గుణాలు మామిడి తొక్కలో ఉన్నాయి. దీన్ని తీసుకోవడం వల్ల గుండెజబ్బులు వచ్చే ప్రమాదం 40 శాతం తగ్గుతుందని నిపుణుల అభిప్రాయం.



**రసాయనాలతో పండిన మామితో అనర్థాలు:** కొంతమంది విక్రయదారులు రసాయనాలను ఉపయోగించి మామిడిని అసహజంగా పండిస్తున్నారు. అలాంటి పండ్లను తినడం వల్ల ఆరోగ్యానికి అనర్థాలే తప్ప ప్రయోజనాలు ఏమీ ఉండవు. సహజంగా పండిన పండులోనే ఎక్కువ పోషకాలు ఉంటాయి. మామిడి పండ్లను పండించేందుకు సాధారణంగా కాల్షియం కార్బైడ్‌ను ఉపయోగిస్తారు. అలాగే ఈథెఫోన్ అనే రసాయనాన్ని కూడా వినియోగిస్తారు. ఈ రసాయనాలు పండ్లపై అసిటలీన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తాయి. ఈ మామిడి పండ్లు నిర్ణీత సమయం కంటే ముందుగానే పండిపోతాయి. దీనివల్ల మామిడిలో ఉండే ఖనిజాలు, పోషకాలు విచ్ఛిన్నమవుతాయి. ఆర్సెనిక్, ఫాస్పరస్ వంటి విషపూరిత మూలకాలు ఉత్పత్తి అవుతాయి. వాటిని తింటే అనారోగ్యమే తప్ప ప్రయోజనాలు సున్నా. సహజమైన మామిడి పండ్లు చెట్టుకే పండుతాయి. వాటి నుంచి మంచి సువాసన వస్తుంది. కానీ రసాయనాలతో పండించిన పండ్ల వల్ల ఎలాంటి సువాసన ఉండదు. చర్మంపై దురదలు, పూతలు వచ్చే అవకాశం ఉంది. కంటిచూపు కూడా దెబ్బ తినవచ్చు. గొంతులో ఇబ్బంది అనిపిస్తుంది. మింగడం కష్టంగా మారుతుంది. కళ్లల్లో మంటలు, గొంతు మంట మొదలవుతుంది. శ్వాస లోపాలు, పుండ్లు పడడం, దగ్గు వంటివి కూడా కలుగుతాయి. అందుకే రసాయనాలతో పండిన మామిడిని తినకుండా నివారించడం చాలా అవసరం. రసాయనికంగా పండిన మామిడిని తినడం వల్ల హైపోక్సియా అనే పరిస్థితి ఏర్పడవచ్చు. హైపోక్సియా అనేది కణజాలాలకు తగినంత ఆక్సిజన్ అందకపోతే వచ్చే పరిస్థితి. రక్తంలో ఆక్సిజన్ పడిపోయినప్పుడు ఇది వస్తుంది. హైపోక్సియా వల్ల మైకం, నిద్రలేమి వంటి లక్షణాలు కలుగుతాయి. జ్ఞాపకశక్తి కోల్పోవడం, కాళ్లల్లో తిమ్మిరి రావడం, రక్తపోటు పడిపోవడం వంటివి కూడా జరగవచ్చు. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుణ్ని సంప్రదించాలి. రసాయనాలతో మామిడిని పండించే ఎరిపై ఎన్ని చర్యలు తీసుకున్నా షరా మామూలే. ప్రజల ఆరోగ్యంతో వారికి సంబంధం లేదు. డబ్బుతో వారి సంచులు నిండితే చాలు. ఇంకా కఠినమైన చట్టాలు తెచ్చి ఇటువంటి వారిపై గట్టి చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది.

నష్టాల్లో మామిడి రైతు

అటు ప్రకృతి వైపరీత్యాలు, ఇటు మార్కెట్ వసతులు లేకపోవడంతో మామిడి రైతులు చతికిలపడుతున్నారు. కొన్ని సందర్భాలలో ప్రకృతి అనుకూలించక అకాల వర్షం, ఈదురు గాలుల వల్ల పూత రాలిపోయి, తెగుళ్ల వల్ల దిగుబడి తగ్గి రైతులు భారీగా నష్టపోతున్నారు. రైతు వద్ద తక్కువ ధరలకు మామిడిని కొన్ని దళారులు వాటిని ప్రజలకు కిలోల లెక్కన అధిక దరలకు అమ్మి లాభాలు ఆర్జిస్తున్నారు. సామాన్యుడికి అందుబాటులో ఉండవలసిన మామిడిని అత్యధిక ధరలకు అమ్ముతూ, ధరలను చూసి భయపడేలా చేస్తూ మామిడి రుచులను పేదలకు దూరం చేస్తున్నారు. కొందరైతే నాణ్యత లని మామిడి చుట్టూ నాలుగు మామిడి ఆకులు పెట్టి చెట్టుకు పండిన కాయలంటూ అసత్యం పలుకుతూ లాభార్జనలు చేస్తున్నారు. ఇటువంటి వాటిని నివారించి, నష్టపోతున్న రైతులను ఆదుకోవలసిన అవసరం ఉంది. ✦




# అశ్లీల బెదిరింపుల వలలో పడకుండా..

**ఆన్‌లైన్‌లో** నగ్న చిత్రాలు, వీడియోలతో బెదిరించటాన్ని అడ్డుకోవటానికి ఇన్‌స్టాగ్రామ్ కొత్తగా న్యూడిటీ ప్రొటెక్షన్ ఫీచర్‌ను ప్రవేశపెట్టనుంది. ఇన్‌స్టాగ్రామ్ డీఎంలలో ఉండే ఈ ఫీచర్ దానంతటదే నగ్న చిత్రాలను పసిగడుతుంది. నగ్న చిత్రాలను షేర్ చేయటానికి ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించు కునేలా చేస్తుంది. ఇది మెషిన్ లెర్నింగ్ సాయంతో ఇన్‌స్టాగ్రామ్ డీఎంల ద్వారా పంపే నగ్న చిత్రాలను విశ్లేషిస్తుంది. ఎవరికైనా రిపోర్టు చేస్తే తప్ప ఇన్‌స్టాగ్రామ్‌ను నిర్వహించే మెటా కంపెనీ సైతం వీటిని యాక్సెస్ చేయలేదు. మిత్రులకు చూపిస్తామనే మోసాలు ఇటీవల ఎక్కువవుతున్నాయి. ఇలాంటి వాటి బారినపడకుండా చూసుకోవటానికి ఈ కొత్త ఫీచర్ ఉపయోగపడుతుంది. పద్దెనిమిదేళ్ల లోపు వయసువారి ఇన్‌స్టాగ్రామ్ యాప్‌లో ఇది డీఫాల్ట్‌గానే ఆన్ అయ్యుంటుంది. పెద్దవారైతే ఆన్ చేసుకోవాలని నోటిఫికేషన్ రూపంలో ప్రోత్సహిస్తుంది. దీన్ని ఆన్ చేసుకున్నాక ఎవరైనా నగ్న చిత్రాలను పంపిస్తుంటే అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తుంది. ఒకవేళ మనసు మార్చుకుంటే అన్‌సెండ్ చేసుకునే సదుపాయమూ ఉంటుంది. అసభ్య ఫొటోలను పంపిస్తున్నప్పుడు మెటా సేఫ్టీ టిప్స్‌లోకి వెళ్లేలా చేస్తుంది కూడా. ఎవరైనా వాటిని స్క్రీన్‌షాట్ తీయొచ్చని, ఫార్వర్డ్ చేయొచ్చని గుర్తు చేస్తుంది. లేదూ ఫొటోలు, వీడియోలను అందుకున్న వారితో ముున్ముందు సంబంధాలు మారే అవకాశముందనీ హితవు చెబుతుంది. డీఎంలలో అవాంచిత నగ్న చిత్రాలను మసకగా చేయటం, వార్నింగ్ స్క్రీన్ కింద పెట్టటం ద్వారా వాటిని చూడకుండా కూడా ఈ ఫీచర్ అడ్డుకుంటుంది. వాటికి స్పందించొద్దని చెప్పటంతో పాటు పంపినవారిని బ్లాక్ చేసుకోవటానికీ వీలు కల్పిస్తుంది. కావాలనుకుంటే రిపోర్టు కూడా చేయొచ్చు.



# స్మార్ట్‌లాక్

**ఇది** చాలా స్మార్ట్‌లాక్. ఎంత ఆరితేరిన దొంగలైనా దీన్ని తెరవలేరు. ముఖం గుర్తుపడితే తప్ప ఈ తాళం తెరుచుకోదు. అమెరికన్ హైటెక్ తాళల తయారీ సంస్థ 'లాక్లీ' ఈ స్మార్ట్‌లాక్‌ను రూపొందించింది. ఇంట్లో ఉండేవారి ముఖాలను దీనిలోని కెమెరా ద్వారా ఫొటో తీసి సేవ్ చేసుకుంటే చాలు. రెండున్నర అడుగుల దూరం నుంచే అది ముఖాన్ని గుర్తుపడుతుంది. ఇందులో సేవ్ అయిన ముఖమైతేనే తెరుచుకుంటుంది.
ముఖాన్ని గుర్తుపట్టాక ఇది కేవలం ఒకటిన్నర సెకండ్లలోనే తెరుచుకుంటుంది. ఇందులో వంద వరకు ముఖాల ఫొటోలను, వేలిముద్రలను సేవ్ చేసుకోవచ్చు. యాపిల్ హోమ్‌కీ యాప్ ద్వారా దీనిని ఐఫోన్, యాపిల్ స్మార్ట్ వాచీలతో ఉపయోగించుకునే వీలుంది. అలాగే, గూగుల్ అసిస్టెంట్, అమెజాన్ అలెక్సా ద్వారా కూడా ఈ స్మార్ట్‌లాక్‌ను ఉపయోగించుకోవచ్చు. దీని ధర రూ 39.033.





# ఆదివారం కవిత్వం

# నిశ్శబ్దంగా మండటం నేర్చుకో!



**కొన్ని** కోట్ల గొంతుకలను ఏకం చేసే
నీ ఆశయాల ఆయువు,
ఆగని నీ అపజయాల కడలిలో..
అర్థాంతరంగా మునిగిపోతుందని
ఆందోళన
పడుతున్నావా?
కొన్ని తరాల తత్త్వాల
సారాంశపు పాఠ్యాంశమైన
నీ సంకల్పపు సాహిత్యపు ప్రకాశం
సమాజపు అజ్ఞానపు
అమాయకత్వంలో మాయమవుతుందని
నిశీధి నీడలో నిద్ర పోతున్నావా?
నీ ఆలోచనల యజ్ఞం
ఓ అరుణోదయమై..
అనునిత్యం ఈ జగతిపై
ఓ జ్ఞానయుద్ధం చేస్తుంటే
అలలా ఎగసిపడే
నీ జీవితపు అడుగులు
చరిత్ర గతిని మార్చే
పోరాటపు అక్షరాలై
అక్షరాస్యతను పరిగెత్తిస్తుంటే
నీలో నువ్వు నిశ్శబ్దంగా
మండలం నేర్చుకో కొంత కాలం!
నిర్దిష్ట సమయం తర్వాతే
రాకెట్‌లా పెద్ద శబ్దమై
అనంత విశ్వంలోకి విక్రమ్
ల్యాండర్‌లా దూసుకెళ్తావు
అందనంత ఎత్తులో ఎదిగి
భవిష్యత్ యువతకు నువ్వే
ఓ ఉన్నత వ్యక్తిత్వపు
స్ఫూర్తి శిఖరమవుతావు
విశ్వ గమనాన్ని మార్చే ఫిజిక్స్
సూత్రమై మిగిలిపోతావు!

– ఫిజిక్స్ అరుణ్‌కుమార్

# నేల తల్లి

**అవని** అంటే భూతల్లిరా
జీవరాసుల ఆకలి తీర్చే అమ్మరా
జీవులకు సర్వం సమకూర్చే వసుంధరా
ప్రకృతి పంచభూతాలతో వెలిగే విశ్వంభరరా
నదులు పొంగి పాడి పంటలు పండే ధరణిరా
ప్రాణుల పుట్టుకల పునాది పుడమిరా
ఉదయాస్తమానాలు పొద్దుపొడుపుల ఉర్విరా
అమావాస్య చీకటి పున్నమి వెలుగురా
పట్టు విడుపుల గ్రహణముల గ్రహమురా
కశ్యపుడు పొందిన నేల కాశ్యాపిరా
దేశాన్ని మాతగా కొలిచే ఏకైక దేశంరా
నా భారతదేశం పుణ్యభూమిరా
మలినమెంత చేసినా మన్నించే మాతరా
గునపాలు గుండెలో దించకురా
దాచుకున్నదంతా నీకే దోచి
ఇచ్చురా
అది నేల తల్లి
అనుగ్రహంరా
సహనానికి మారుపేరు
భూమాతరా
రాజు పేద తేడా లేనేలేదురా
అందరినీ తనలో ఐక్యం చేసుకొను సమవర్తిరా
ప్రకృతిని కాపాడి తరతరాలకు అందించురా
భుక్తి యొసంగినందుకు భక్తితో మెలుగురా.
భూతల్లే అమ్మయని ఎప్పుడూ
మరువకురా.
దేవతామూర్తియే నేలతల్లిరా
నేలతల్లికి మొక్కిన ముక్తి పొందుతావురా!



– పి.బక్కారెడ్డి




## 'సరోజ' జస్టిస్ బి.చంద్రకుమార్

జస్టిస్ బి.చంద్రకుమార్ విలక్షణ మానవతావాది. సామాజిక చైతన్యమూర్తిగా అట్టడుగు వర్గాల న్యాయం, జీవన శ్రేయస్సు కోసం పరితపించే వ్యక్తిత్వం ఆయన చేపట్టే కార్యాచరణలో, ఉద్యమ స్ఫూర్తితో నిత్యం ప్రతిబింబిస్తుంది. తొలి నవలగా, 'సరోజ' నవల వెలువడింది. ఎదురైన, చూసిన వాస్తవిక సంఘటనలను నవలగా రూపొందించారు. సరోజ, ఈ నవలలో ఆయన సృష్టించిన పాత్ర అనిపించదు. నవల చదువుతుంటే పాత్రల వాస్తవికతకత, రచయిత తన అనుభవాల, ఆదర్శాలను తన ఆలోచనలను ఈ నవల ద్వారా ప్రదర్శింపచేసారు. ఎక్కడా కృత్రిమత్వం, దాపరికం, కల్పనా చమత్కృతి, ఆవేశ ఆదర్శాల ఆడంబరత్వం కనపడదు. కథ సూటిగా నడుస్తుంది. పాత్రల స్వభావాలు మనల్ని రోజూ పలకరించే మనుష్యులవే. ఒక సమకాలీన జీవితం మన కళ్లముందు కదులుతుంది. నడుస్తుంది. ఆలోచింప చేస్తుంది. ప్రస్తుత సమాజ నడవడిక వ్యక్తీకరిస్తుంది. సమస్యలను పరిష్కరిస్తుంది. అందరూ హాయిగా నవ్వుకోవడంతో నవల పూర్తవుతుంది. జస్టిస్‌గా బి.చంద్రకుమార్ నవలా రచయితగా అభినందనీయులు.

**(సరోజ, రచన: జస్టిస్ బి.చంద్రకుమార్, వెల: రూ 150, ప్రతులకు: ఇ.నం.8-7-55/బి/2, రోడ్‌నం. 3, శిరిడీసాయి కాలనీ, సాగర్‌రోడ్, హస్తినాపురం సెంట్రల్, హైదరాబాద్)**

**– యర్రమిల్లి**

## ఏడువాక్యాల అన్వేషి 'భూపతి'



ఈమధ్యకాలంలో నవలా రచన బాగా తగ్గిపోయింది. మహిళా రచయిత్రులు, డిటెక్టివ్ రచయితలు ఒకానొక కాలంలో ప్రభంజనంలా తెలుగు పాఠకుల్ని ఉర్రూతలూరించారు. 'అన్వేషి' అనే పదం చూడగానే అరవై ఏళ్లకిందట పోతుకూచి సాంబశివరావు 'అన్వేషణ' నవల గుర్తుకొస్తుంది. అయితే కథాంశం వేరు. ఈ నవలలో చాలాఎక్కువ పాత్రలు మధ్యమధ్యలో వస్తూ వుంటారు. కొంచెం సీరియస్‌గా పాఠకులు దృష్టిపెట్టి చదవాలి. లలితచిట్టి ముందుమాట నవలపై ఆసక్తి పెంచుతుంది. ఆధ్యాత్మిక భావాలు ధైర్యసాహసాలు, శ్రీజ, జింజియా, హంగ్మాన్ మనస్తత్వాలను అద్భుతంగా ఆవిష్కరించారు. ఎడారుల్లో ఎత్తైన పర్వతాల్లో సముద్రమట్టాల్లో కథను నడపడం బాగుంది. సనాతన మునిపాత్రల చిత్రణ సమాజంలో శాంతి, సామరస్యం, పరిఢవిల్లుటకు రచయిత ఎంచుకొన్న సన్నివేశాలు, చర్చించిన వ్యక్తుల పుస్తకాలు పాఠకుల్లో ఆసక్తిని పెంచడమేగాక భూపతికి నోబుల్ బహుమతి రావడం స్వీడన్ భార్యతో వెళ్లడం (జింజియా) కూతురు వేద పాత్రలు బాగున్నాయి. తాత్విక అన్వేషకుడిలో అన్నీ పుడతాయి. క్రియాయోగంలో మూడు మెట్లుంటాయి..జీవికి నాది అనుకోవడమే సకల క్లేశాలకు కారణమైంది. పాజిటివ్ ఎనర్జీతో విజయం సాధిస్తారు అనే సందేశం భూపతి పాత్ర ద్వారా రచయిత చక్కగా చెప్పారు. ఆలోచన పెంచే అద్భుత కథాకథనం.

**(భూపతి, రచన: బండి శ్రీనివాస్, వెల: రూ 200, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్)**

**– తంగిరాల చక్రవర్తి**

**పుస్తక సమీక్ష**

మాండలికానికి ప్రాణం పోసి విరివిగా కథలు రాస్తున్నారు. అపరపరపస్తుసూరియై రాజు ఈ నవలలో జంతువులతో మనుషుల్లా మాట్లాడిస్తున్నారు. సుందరం, తిరుపాలు పెంచల్‌రాజు, వడివేలు గొర్రెలకాపరులు, మేకపోతు, నల్లగొర్రె, కుంటిమేక, తెల్ల పొట్టెలు వీళ్ల మందల్లోని జీవాలు. స్వతంత్ర్య జీవితం కోరుకుని, నాలుగు విడివడి బయటి ప్రపంచాన్ని గమనించి

## మరో చిన్నయ్య సూరి




తిరిగి తమతమ మందలో కలపటం కథాంశం. మనిషి, పెంపుడు జంతువులు పరస్పరాధీనాలుం వేలఏళ్ల కాలం నుండి వస్తున్న ఈ అనుబంధాన్ని ఉన్నతీకరిస్తూ రాసిన ఈ నవల లో రాజు రాయలసీమ ప్రత్యేకించి చిత్తూరు జిల్లా యాస, భాషల ను, పదమాధుర్యాన్ని పాఠకులకు రుచి చూపుతున్నారు. మచ్చుకు కొన్ని: తాకితే, ఆడపిల్లా, అత్తిపత్తి ఒకటే వానలో తడవని వాడు పెళ్లాం మాట విననివాడు ఉండదు. అర్థం కాని అరవిక్ సినిమా చూసినట్లు మేకలకు తెలిసిందల్లా మేత ఒక్కటే. బాధ పడేకొద్దీ బాధే మిగులుతుంది. నొప్పి లేకుంటే డాక్టరుని, కష్టాల్లేకుంటే దేవుడిని పట్టించుకోరు. గొర్రెల కాపరుల జీవితాలను అతిదగ్గరగా చూసి రాసిన నవల కనుక వాస్తవానికి అతిదగ్గరగా ఉంది. రాజుగారి సాహితీయానంలో ఈ కొత్త మలుపుకు అభినందనలు.

**(మేకలబండ, నవల: రచన ఆర్.సి.కృష్ణస్వామి రాజు, వెల రూ: 100, ప్రతులకు: 22-4-71, బ్యాంకు ఎంప్లాయీస్ కాలనీ, మంగళం రోడ్డు, తిరుపతి)** **– కూర చిదంబరం**

'కవుల నవ్యసృష్టి..భవ్యసృష్టి..కవిత్వం' అనే అవగాహన తో 'ఇది నా కవిత్వం..ఉన్న దాని నుండే వచ్చింది/ నానుండే వచ్చింది' అంటూ ' ఈరోజే కవిత రాయాలని/ కాగితం, కలం ముందేసుక్కుర్చున్నా' అని వివరిస్తూ హుసూరు కవి

## అగరం వసంత్ వికసిస్తున్న హుసూరు కవిత్వం



డా॥అగరం వసంత్ 51 కవితలతో 'కథ మరి చిన మనిషి' పేరిట తన తొలి కవితా సంపుటి వెలువరించారు. 'నరవానర దశ నుండి/ మానవ జాతిగా పరిమాణం పొంది/ కాలగమనంలో కదిలిన మనిషి గతం మరిచిన పిచ్చి మనిషి/ కోతుల జాతుల/ కథ మరిచిన మనిషి..' యిలా గతాన్ని మరిచిపోయిన మనిషి అహంకార ధోరణిని ఎండగడ్తా రు. 'చెమటోడ్చి సంపాదిస్తే..నోట్లు/ చెమటల్ని పూడ్చి సంపాదిస్తే.. కోట్లు' అంటూ నేటి సమాజంలో పెత్తందారు చేస్తున్న శ్రమ దోపిడీపై పీడితుల ఆరని ఆకలి మంటలపై కవి ఆగ్రహం పలు కవితల్లో ప్రస్ఫుటంగా గోచరమవుతుంది. 'దేవుడా నీ పేరేమిటి? జీవుడా నీతీరేమిటి? అబద్ధం దేవుడా? దేవుడే అబద్ధ మా?' ఆలో చనలు రేకెత్తించే ప్రశ్నలు సంధిస్తాడు వసంత్. 'నీ కల నువ్వే సాకా రం చేసుకోవాలి/ సాధనతో వేదన తొలగించుకోవాలి/ నీకల నిజం చేసుకోవాలి' అని ప్రబోధాత్మకంగా పలువరిస్తున్న ప్రవా సాంధ్ర కవి అగరం వసంత్ ను ఆదరించి ప్రోత్సహించడం తెలుగు సాహితీ ప్రియుల కర్తవ్యం. **(కథ మరిచిన మనిషి, రచన: అగరం వసంత్, వెల: రూ 200, ప్రతులకు: అన్ని ప్రముఖ బుక్‌హౌస్)** **– రమణ వెలమకన్ని**

# కెరీర్‌లో సక్సెస్ సాధ్యమే



**పేదరికం** లక్ష్యసాధనకు అడ్డుకాదని నిరూపించాడు ఒక యువకుడు. సంకల్పబలంతో అత్యున్నత స్థితిని అందిపుచ్చుకున్నాడు. సానుకూల దృక్పథం జీవం పోసింది. గుణసంపద బాట వేసింది. ఆత్మగౌరవం వెన్నుతట్టింది. ఆత్మవిశ్వాసం నడిపించింది. సివిల్స్‌లో ర్యాంకు స్వంతం అయ్యింది. ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం, ఊళ్లపాల్యానికి చెందిన ఉదయకృష్ణారెడ్డి చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. ఆయన నాన్నమ్మ కూరగాయలు అమ్మి చదివించింది. ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో, డిగ్రీవరకు చదివాడు. నాన్నమ్మను కష్టపెట్టడం ఇష్టంలేక పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగంలో చేరాడు. అయితే స్కిల్ ఇన్‌స్పెక్టర్ అవమానించడంతో ఉద్యోగానికి రాజీనామా చేశాడు. 2019 నుంచి సివిల్స్ సాధనపై దృష్టిపెట్టాడు. నాలుగవ ప్రయత్నంలో 780వ ర్యాంకు సాధించి వార్తలకు ఎక్కాడు. తెలంగాణకు చెందిన దోనూరు అనన్య సివిల్స్‌లో మొదటి ప్రయత్నంలోనే మూడవర్యాంకు సాధించింది. మహబూబ్‌నగర్ జిల్లాలో పుట్టిన ఆమె రోజుకు 12-14 గంటలు చదివి లక్ష్యాన్ని చేరుకున్నది. ఆంత్రోపాలజీకి మాత్రమే కోచింగ్ తీసుకున్నది. మిగిలిన అంశాలు స్వంతంగా చదివి ఆకలింపు చేసుకున్నది.

సివిల్స్ అంటే అందని ద్రాక్షేమీ కాదని నిరూపించింది. మేధస్సులో మహిళలు తక్కువ కాదని లోకానికి చాటింది. అందరికి ఆదర్శంగా నిలిచింది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన కూనారపుసిరి ఇంటర్ సీఈసీలో 927 మార్కులు సాధించింది. సహజం. ఇందులో గొప్పేముంది అనుకుంటారు. అయితే ఆమె తీవ్రమైన అనారోగ్యాన్ని ఎదుర్కొని మార్కులు సాధించడం చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఆమె ఐదేళ్లుగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతోంది. గత ఎనిమిది నెలల క్రితం రెండు కిడ్నీలు పూర్తిగా చెడిపోవడంతో వారానికి రెండుసార్లు డయాలసిస్ చేయించుకుంటోంది. చదువుపై ఆసక్తితో కష్టపడి చదివింది. కాలేజీకి వెళ్లకపోయినా స్మార్ట్‌ఫోన్‌లోనే చదువుతూ మంచిమార్కులు సాధించింది.

## లక్ష్యం నడిపిస్తుంది

జీవితంలో పదవతరగతి, ఇంటర్‌మీడియేట్ చాలా కీలకం. ఏమి చదవాలి, యే స్థితికి ఎదగాలి అన్నది ఈ దశలోనే నిర్ణయించుకోవాలి. పదవతరగతి తరువాత ఇంటర్‌మీడియట్‌లో తీసుకునే గ్రూపులను బట్టే ఉన్నత చదువులు చదివే అవకాశం ఉంటుంది. సాధారణంగా సైన్స్, ఆర్ట్స్, కామర్స్ అన్న ప్రధాన విభాగాలు ఉంటాయి. డాక్టరు, ఇంజనీరు కోర్సులకే ఇప్పుడు డిమాండ్ ఎక్కువ. బైపిసి గ్రూపు తీసుకున్న వారు వైద్యసంబంధవృత్తి విద్యాకోర్సులు చేయవచ్చు. కొన్ని చోట్ల ఎంబైపీసీ గ్రూపు కూడా ఉంటుంది. ఇది చదివితే అటువైద్యవృత్తి, ఇటు ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరడానికి అవకాశం ఉంటుంది. ఎంపిసీ చదివితే ఇంజినీరింగ్ వైపు వెళ్లవచ్చు. ఇక ఆర్ట్స్, కామర్స్ చదివిన వారు వివిధ డిగ్రీలు పిజిలు చేసి ఆయారంగాలలో రాణించవచ్చు. అన్ని రకాల చదువులు, వృత్తుల్లో పలు విభాగాలు ఉంటాయి. వాటిలో అధికశాతం విద్యార్థులను ఆకర్షించే వృత్తి మాత్రం డాక్టరే. తరువాత ఇంజిరింగ్. ఇటీవల కాలంలో సి.ఎ, ఎం.బి.ఎ

**డాక్టర్ ఎన్.బి.సుధాకర్‌రెడ్డి,**
సైకాలజిస్టు

కోర్సులకు కూడా మంచి డిమాండ్ ఉంది. తాజాగా కొందరు న్యాయశాస్త్రం వైపు కూడా ఆకర్షితులు అవుతున్నారు. ఇటీవల దేశంలో జరిగిన కొన్ని పరిణామాల వల్ల న్యాయవాదులు రోజుకు నాలుగైదు కేసులు వాదించి కోటిరూపాయల వరకు ఫీజులు సంపాదించారు అన్న అంశం అందరికీ తెలిసిందే. ఐఎఎస్, ఐపిఎస్ ఇతర ఉన్నతస్థాయి సివిల్స్ ఉద్యోగాలు సంపాదించడానికి ఏదైనా డిగ్రీ ఉంటే చాలు. అయితే అతితక్కువ మంది మాత్రమే సివిల్స్‌పై దృష్టి పెడతారు. అందులో విజయం సాధించే వారి సంఖ్య చాలా తక్కువగా ఉంటుంది. అయితే పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్ట ఎవరినో చూసి తామూ అదే చదవాలి అనుకోవడం తగదు.



అందరికీ అన్ని సరిపడవు అన్న విషయం గమనించాలి. సరైన లక్ష్యాలను ఎంచుకోవాలి. తమకు ఉన్న ఆసక్తి, నైపుణ్యాలు, అవకాశాలు, తెలివితేటలు, వ్యక్తిత్వం తదితర అంశాల ఆధారంగా కోర్సులను ఎంపిక చేసుకోవాలి. అమ్మ, నాన్నల కోసం పిల్లలు చదవడం అంత సులభం కాదు. ప్రతి వ్యక్తిలోను అన్నిరకాల తెలివితేటలు, నైపుణ్యాలు ఉంటాయి. అయితే పోటీ ప్రపంచంలో ఉన్న కొద్దిపాటి అవకాశాలను అందిపుచ్చుకోవాలి అంటే మరిన్ని తెలివితేటలు నైపుణ్యాలు కావాలి. కొన్ని లక్షణాలు పుట్టుకతో వస్తాయి. వాటికి తగిన సానపట్టుకోవాలి. అంతేతప్ప ప్రతిపని మనం చేయగలం అనుకోవడం మంచిది కాదు. వ్యాకరణం, భాష బాగా నేర్చుకున్నంత మాత్రాన కవి, రచయిత కాలేము. సామాజిక స్పృహతోపాటు సృజనాత్మక శక్తి ఉన్నప్పుడే రచనారంగంలో రాణించవచ్చు. సంగీతం నేర్చుకున్నంత మాత్రాన అద్భుత గాయకులం కాలేము. దానికి గాత్రం తోడవ్వాలి. ప్రతి డాక్టరు, ఇంజినీరు, లాయర్లు, ఇతర



వృత్తుల్లో ఉన్నవారు అత్యున్నతంగా రాణించలేరు. పరిగెత్తడం వేరు పరుగుపందెంలో గెలవడం వేరు. కాబట్టి పది, ఇంటర్ తరువాత యే కోర్సులు ఎంచుకోవాలి. ఎలాంటి లక్ష్యాలు నిర్దేశించుకోవాలి అన్నది కీలకం. దీనికి స్వీయ అవగాహన ముఖ్యం. ఆశలు, ఆశయాలు, అభిరుచులు, నైపుణ్యాలను అంచనా వేసుకోవాలి. దూరదృష్టితో అవకాశాలను గూర్చి తెలుసుకోవాలి. అనుకూలతలు గూర్చి మూల్యాంకనం చేయాలి. అవసరం అయితే నిపుణుల సలహాలు తీసుకోవాలి. ఇప్పుడు కెరీర్ గైడెన్స్ వృత్తిగా స్వీకరించిన వారు ఉన్నారు. వారితో చర్చించి స్వీయ సామర్థ్యాలను అంచనా వేసుకుని లక్ష్యాలను ఎంచుకోవాలి.

## సంకల్పం గెలిపిస్తుంది

లక్ష్యం నడిపిస్తుంది. సంకల్పం గెలిపిస్తుంది అన్నది సైకాలజిస్టులు చెప్పేమాట. అయితే, లక్ష్యం అనువైనది అయినప్పుడే సంకల్పం అనుకూలిస్తుంది అన్న విషయం గుర్తించాలి. గుడ్డెద్దు చేలో పడినట్టు వ్యవహరిస్తే ఫలితం ఉండదు. ప్రతికష్టానికి ఫలితం ఉంటుందని చెప్పలేం. సరైన శ్రమకు మాత్రమే అనుకున్న ఫలితం సిద్ధిస్తుంది అన్నది గమనించాలి. మన సమాజంలో వందలాది వృత్తులు, ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి. అయితే ప్రతివృత్తిలో రాణించలేం. చేసే పని పట్ల పూర్తి జ్ఞానం, సమాచారం ఉండాలి. మిడిమిడి జ్ఞానంతో, చాలీచాలని వనరులతో పూర్తిస్థాయి ఫలితాలు సాధించలేం. మహా భారతంలో ఏకలవ్యుడు గురువును సంకల్పించుకుని స్వయం కృషితో అర్జునునితో సమానస్థాయి విలువిద్యా ప్రవీణుడు అయ్యాడు. అయితే అప్పటి సామాజిక పరిస్థితుల వల్ల అతనికి దురదృష్టం ఎదురయ్యింది. కర్ణుడు చాలాగొప్ప వ్యక్తి అయినప్పటికీ శాపాలు ఆయన మరణానికి దరితీశాయి. అభిమన్యుడు పద్మవ్యూహంలోకి ప్రవేశించడం మాత్రమే తెలియడం వల్ల దుర్మరణం చెందాడు. శ్రీకృష్ణుడు సరైన వ్యూహం, మార్గనిర్దేశం చేయడం ద్వారా పాండవులను గెలిపించగలిగారు. ఇదేదో పుక్కిటి పురాణం మాటలుగా కొట్టిపారవేయడం మంచిది కాదు. నిర్వహణారంగ నిపుణులు వ్యక్తిత్వ వికాస శిక్షకులు కూడా పురాణాలు. ఇతిహాసాల నుంచి అనేక అంశాలను స్వీకరించి ఎదిగే వారికి మార్గదర్శనం చేస్తున్నారు. 'సాధనమున పనులు సమకూరు ధరలోన' అన్న మాట ఆర్యోక్తిలా ప్రాచుర్యం పొందింది. అయితే సరైన సాధన ఉంటేనే సాధ్య అన్న మాటను ఆధునిక శిక్షకులు స్పష్టంగా చెపుతున్నారు. కాబట్టి విద్యార్థులు యువకులు తమ ఆశలకు అనుగుణంగా లక్ష్యాలను ఎంచుకునే సమయంలో అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. యవ్వన దశలోనే కెరీర్‌కు గట్టి పునాదులు వేసుకోవాలి.

## సానుకూల దృక్పథం అవసరం

సమాజంలో కొందరు అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు నష్టపోతుంటారు. దీనికి ప్రధాన కారణం ఆలోచనా విధానం, దృక్పథంలో లోపం అన్నది పలు అధ్యయనాలలో వెల్లడయ్యింది. మన సవజంలో కొందరు నిరంతరం ప్రతికూల భావాలతో కొట్టుమిట్టాడుతుంటారు. ప్రతి చిన్న సమస్యను భూతద్దంలో చూసి భయపడుతుంటారు. కర్మఫలం, జాతకం అంటూ బాధపడుతుంటారు. అయితే సానుకూల దృక్పథం నిరంతర ఇంధనంలా మనిషిని ముందుకు నడిపిస్తుంది. ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుంది అన్న నమ్మకమే సానుకూల దృక్పథం. ఆశావాదం అందుకు మూలం. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుంటూ ప్రత్యామ్నాయమార్గాలు అన్వేషిస్తూ ముందుకు వారు తప్పకుండా విజయాలు సాధిస్తారు.

**(మిగతా 19వ పేజీలో)**



కథ

# నిజాయితీ

అనగనగా ఒక రాజ్యం. ఆ రాజ్యానికి ఒక రాజు ఉన్నాడు. అతనికి ఒక అంతుచిక్కని వ్యాధి ఉంది. ఇక తాను ఎక్కువ రోజులు బతకనని రాజుగారు అనుకొని అందుకు తన రాజ్యానికి ముందుగానే ఒక నిజాయితీ గల యువరాజుని ఎన్నుకోవాలి అనుకున్నాడు.

మరునాడే రాజ్యంలోని యువకులందరినీ పిలిపించి ఈ విషయం చెప్పాడు. అందరికీ తలా ఒక విత్తనం ఇచ్చి, 'పదిరోజుల తర్వాత మొక్కను పెంచి తీసుకొని రమ్మన్నాడు. ఎవరి మొక్క అయితే పెద్దగా, బలిష్టంగా ఉంటుందో వాళ్లే ఈ రాజ్యానికి రాజు' అని చెప్పాడు.



అందరూ ఆ విత్తనాన్ని ఇంటికి తీసుకువెళ్లి కుండీలలో నాటారు. పదిరోజుల తర్వాత అందరూ ఆ విత్తనం నాటిన కుండీలని తీసుకొని వచ్చారు. కానీ మహేంద్ర అనే ఒక యువకుడు మాత్రం ఖాళీ కుండీని తీసుకొచ్చాడు.

అప్పుడు రాజు అందరి కుండీలను పరిశీలించి ఆ ఖాళీ కుండీని తీసుకువచ్చిన మహేంద్ర అనే యువకుడిని ఆ రాజ్యానికి రాజు అని ప్రకటించాడు. దీంతో అందరూ యువకులు విస్తుబోయి చూశారు. అంతలో ఒక యువకుడు ఓ మహారాజా! మేము నాటిన విత్తనాలు మొక్కలుగా మారాయి కానీ, ఆ మహేంద్ర నాటిన విత్తనం కనీసం మొలకెత్తనేలేదు. మీరు అతనిని ఆ రాజ్యానికి రాజును ఎలా చేస్తారనీ అడిగాడు.

అప్పుడు రాజు 'నేను మీకు ఉడకబెట్టిన విత్తనాలు ఇచ్చాను. అలాంటప్పుడు మీకు ఇచ్చిన విత్తనం నుంచి మొక్క ఎలా వచ్చింది' అని ప్రశ్నించాడు.

ఆ ప్రశ్నకి ఎవరూ జవాబు ఇవ్వలేదు. తాము చేసిన పనికి సిగ్గుతో తలవంచుకున్నారు.

అప్పటి నుండి ఆ రాజ్యానికి మహేంద్రనే రాజుగా ఉన్నాడు. ఆ రాజ్యానికి ఎలాంటి లోటు లేకుండా నిజాయితీతో పరిపాలించసాగాడు.

రాజ్యానికి రాజు కావడానికి యువకులు అందరూ వేరే విత్తనాలు నాటారు కానీ మహేంద్ర రాజు ఇచ్చిన విత్తనాన్నే నాటి నిజాయితీతో రాజు అయ్యాడు.

**- పుల్లగూర్ల శీర్షిక**

## రంగులు వేయండి



## చుక్కలు కలపండి







## బాలగేయం

### కవులకు వందనం

పిల్లలు పిల్లలు రారండి
బాల సాహిత్యం రాసే
కవుల్ని మనసారా
అభినందించుదాం
కలకాలం తలుచుకుందాం
మనసుకు వయసు తగ్గింది
మనం కోసం కథలు
రాసారు మనతో స్నేహం
పెంచుకుని
మనలో ఒకరిగా మెలిగారు
అలతి అలతి పదాలతో
గెయాలెన్నో రచించారు
మనం ఆడుతూ
నిత్రమత్తుని తొలగించి
జ్ఞానాన్ని నిండుగా
ఒంపారు
ఎంతెంతో శ్రమ పడుతూనే
చక్కటి రచనలు చేసారు
లోకాన్ని పరిచయం చేస్తూ
విజ్ఞానం ఎంతో నింపారు
చిట్టిచిట్టి కథలను రాసి
చిట్టి బుర్రకు ఎక్కించారు
బాల కవిత్వం రాసే
కవులకు
ఎల్లప్పుడూ రుణపడి
వుందాం మేటి గురువులు
గా ఎంచుకుని అనునిత్యం
స్మరించుకుందాం

**- నరెద్దుల రాజారెడ్డి**

## హలో ఫ్రెండ్...


**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- ఎన్.శశిరేఖ,** విజయవాడ

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. కంప్యూటర్ వైరస్ అంటే ఏమిటి?**



**జవాబు: శశిరేఖ!** కంప్యూటర్ వైరస్ అనేది ఒక రకమైన ప్రోగ్రామ్. ఎటువంటి కమాండ్‌తో నిమిత్తం లేకుండానే తనంతట తాను కంప్యూటర్‌ను తొలచివేయడం ఈ ప్రోగ్రామ్(వైరస్) ప్రత్యేకత. హార్డ్ డిస్క్, ఫ్లాపీ డిస్క్‌లుగా పిలిచే సిస్టమ్ ఏరియా (ఎగ్జిక్యూటివ్ ఫైల్స్)లోకి ప్రవేశించిన వైరస్ అందులోని ప్రోగ్రామింగ్ ఫైల్స్ అన్నింటినీ కాపీ చేస్తుంది. అలా కాపీ చేసిన ఫైళ్లను ధ్వంసం చేసి మరిన్ని ఫైళ్లను కాపీ చేస్తుంది. ఈ రకంగా కంప్యూటర్‌లోని అన్ని విభాగాలకు విస్తరించి మొత్తం సిస్టమ్‌ను ధ్వంసం చేయడమే వైరస్‌ల ప్రత్యేకత. వార్మ్స్/ట్రోజాన్స్ వంటి రకాల వైరస్‌లలో కొన్ని మెయిల్స్ రూపంలో కంప్యూటర్‌లోకి ప్రవేశిస్తాయి. మెయిల్‌ను ఓపెన్ చేయగానే అవి కంప్యూటర్ లోని ప్రోగ్రామ్ ఫైళ్లను ధ్వంసం చేసే కార్యక్రమం ప్రారంభిస్తాయి. కొన్ని వైరస్‌లు హార్డ్ డ్రైవ్స్ మీదకూడా విశృంఖలంగా దాడి చేసి, పనితీరును అదుపులో ఉంచుకుంటాయి.

**- బి.అక్షిత,** మంగళగిరి

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. పచ్చలు అంటే ఏమిటి? వాటి విలువ దేని మీద ఆధారపడి ఉంటుంది?**

**జవాబు: అక్షిత!** పచ్చలు (ఎమరాల్డ్స్) బెరిల్ అనే ఖనిజ రకానికి చెందిన ఆకుపచ్చని రత్నాలు. రంగు, బీటలు లేకపోవడాన్ని బట్టి దాని విలువను నిర్ధారిస్తారు. ఏ లోపం లేని ఎమరాల్డ్ దొరకడం అరుదు. అటువంటి ఎమరాల్డ్ వజ్రం కంటే ఎక్కువ ఖరీదు ఉంటుంది.



# అందరి బాగోగుల్ని చూస్తారు

**అది చతురగిరి మదురై దగ్గర ఓ ఆధ్యాత్మిక కేంద్రం. ఆ కొండెక్కడానికి మెట్లొక్కటే మార్గం. సహజంగా వృద్ధులు ఎక్కలేరు కాబట్టి వాళ్ల కోసం డోలీలుం టాయి. వారాంతాల్లో అక్కడ డోలీ మోయ డానికి వచ్చేవాడు 18 ఏళ్ల ముత్తుకాళీ అనే కుర్రాడు.**

'బుద్ధిగా చదువుకోకుండా నీకెందుకీ కష్టం' అని ఎవరైనా అడిగితే 'నేను హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ చేస్తున్నా..కాలేజీ ఖర్చుల కోసమే ఇలా వస్తున్నా.. అని చెప్పేవాడు. అతనికి తల్లి లేదు..తండ్రి కూలీనాలీ చేసేవాడు. అతని గురించి ఎవరో 'ఫెక్ట్ (ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్) సభ్యులకి చెబితే వాళ్లు అతణ్ణి అక్కున చేర్చుకున్నారు. డిగ్రీ



పూర్తయ్యేదాకా ఫీజులు కట్టారు. కానీ ముత్తుకాళీ డిగ్రీతోనే ఆగిపోవాలనుకోలేదు. హైదరాబాద్‌లో పేరున్న ఓ హోటల్ మేనేజ్‌మెంట్ సంస్థలో పీజీ చేస్తానన్నాడు. 'ఫెక్ట్' అందుకూ సాయపడింది. ఏడాదికి రెండున్నర లక్షలయ్యే ఫీజూ ఇతర ఖర్చుల్ని భరించింది. ఆ కోర్సు తర్వాత ఇంగ్లండ్ వెళ్లిన ముత్తుకాళీ ఇప్పుడు అక్కడో పెద్ద స్టార్ హోటల్‌లో షెఫ్‌గా చేస్తున్నాడు. రాజ్‌కుమార్ తండ్రి ఒకప్పుడు భవన నిర్మాణ కార్మికుడు. పనిచేసేచోట ప్రమాదానికి గురై మంచానికి పరిమితమయ్యాడు. తల్లీ, పెద్దక్కయ్యలకి మతిస్థిమితం లేదు. దాంతో పెద్దమ్మ దగ్గర ఉంటూ ఇంటర్ చదివాడు. 99 శాతం మార్కులు తెచ్చుకున్నాడు. ఆ విషయం తెలిసి స్థానిక నేతలు అతణ్ణి సన్మానించి ప్రభుత్వం తరపున చదివిస్తామన్నారు. కానీ సన్మానం రోజు చేతిలో పెట్టిన పాతికవేలు తప్ప ఎవరూ ఏ సాయమూ చేయలేదు. మరోవైపు మెడికల్ కాలేజీ ప్రవేశానికి సమయం దగ్గరపడుతూ వచ్చింది. ఆ పరిస్థితుల్లో 'ఫెక్ట్' గురించి విని వాళ్లకి ఫోన్ చేశాడు రాజ్‌కుమార్. అప్పటికప్పుడు ఫీజుకట్టి అతణ్ణి కాలేజీలో చేర్చారు. అందులోని సభ్యులు. ఎంబిబిఎస్ ముగించేదాకా కాలేజీ, హాస్టల్ ఫీజులూ, పుస్తకాలకయ్యే ఖర్చులన్నింటికీ సాయపడ్డారు. ప్రస్తుతం రాజ్‌కుమార్ ఎండీ (పీడియాట్రిక్స్) చేస్తున్నాడు. ఈ ఇద్దరూ కేవలం మచ్చుతునకలే. గత 18ఏళ్లలో 'ఫెక్ట్ సంస్థ ఇలాంటివాళ్లు 1200 మందికి సాయపడింది. పదో తరగతితో మొదలుపెట్టి మెడిసిన్, నర్సింగ్, ఇంజినీరింగ్, హోటల్ మేనేజ్‌మెంట్..ఇలా విద్య ఏదైనా సరే అన్ని రకాలా ఆదుకుంటోంది. ఇందుకోసమే ఏటా రూ.50 లక్షలు తమ సభ్యుల నుంచి సేకరిస్తోంది. ప్రతిభ ఉన్నా ఉన్నత చదువుకి పేదరికం అడ్డుపడుతున్న వాళ్లని వెలికితీసి ఉన్నత విద్యావంతులుగా మలుస్తోంది.

**ఇలా మొదలైంది**

ఫెక్ట్ సంస్థని 2006లో దినేష్‌బాబు, ప్రవీణ్, సెంథిల్ అనే మిత్రులు ప్రారంభించారు. ముగ్గురూ నిరుపేద కుటుంబాల నుంచి వచ్చినవాళ్లు. బీటెక్‌లో సహాధ్యాయులు. ఐటీ ఉద్యోగాల్లో కుదురుకున్నాక ఓ సెలవురోజున కలిశారు. పేద విద్యార్థులకి చిన్నగానైనా ఏదైనా చేయాలనుకున్నారు. అప్పటికప్పుడు జేబులోంచి ఆరొందలు తీసి పక్కనపెట్టారు. ఆ తర్వాత నెల మరో ఆరొందలు..ఇలా ఏడాదిపాటు పోగేసి మానసిక వికలాంగ చిన్నారులకి ఆశ్రయమిస్తున్న ఓ స్కూలుకి అందించారు. 'మేం సాయపడ్డ విషయం మా సహోద్యోగులతో పంచుకుంటే వాళ్లూ మాతో కలిసి నడుస్తామన్నారు. అలా రెండో ఏడాదే ముగ్గురం కాస్తా పదిమందిమయ్యాం. మరుసటి సంవత్సరం మా సంఖ్య50కి చేరింది' అని వివరిస్తాడు దినేష్. 2009లో ఈ సంస్థ ట్రస్టుగా రిజిస్టరైయింది. 2015 నాటికి సభ్యుల సంఖ్య 500 మందికి చేరింది. వీరిలో నెలకి వెయ్యి నుంచి పదివేలదాకా ఇచ్చేవాళ్లున్నారు.

**కౌన్సెలింగ్ కూడా:** ఎంత ప్రతిభావంతులైనా కొన్ని కోర్సులుకొరకరాని కొయ్యలా ఉంటాయి. వీళ్ల దగ్గర సాయం తీసుకుంటూ వాటిల్లో చేరి ఫెయిలైపోతున్నా। ఫెక్ట్' వాళ్లకి తమ సాయాన్ని ఆపదు. పైగా వాళ్ల లోపం ఎక్కడుందో తెలుసుకునేలా సైకాలజిస్టులతో కౌన్సెలింగ్ ఇప్పించి దారిలో పెడుతుంది. ధరణి అనే అమ్మాయికి ఇలాంటి పరిస్థితే ఎదురైంది.

తనది దిగువ మధ్యతరగతి కుటుంబం. సీఏ చదవడం తన లక్ష్యమని చెబితే ఫెక్ట్ సభ్యులు ఏడాదికి రెండులక్షల ఫీజుతో కోచింగ్‌లో చేర్పించేవారు. కానీ అక్కడ 'ఇంటర్'లో రెండుసార్లు ఫెయిలై కుంగిపోయింది. 'ఫెక్ట్ ప్రత్యే కంగా కౌన్సెలింగ్ ఇప్పించాక-సీఏ విజయవంతంగా ముగించిన ధరణి ప్రస్తుతం డెలాయిట్ సంస్థలో ఆడిటర్‌గా చేస్తోంది. మొదట తమిళనాడులోని విద్యార్థుల కోసమే మొదలుపెట్టిన ఫెక్ట్ తమ సేవల్ని కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలకూ విస్తరించింది. ఆయా రాష్ట్రాల్లోని తమ వలంటీర్ల సాయంతో నిత్యం విద్యార్థుల బాగోగుల్ని చూసుకుంటోంది. భవిష్యత్తులో మరింతమందికి సాయం చేయాలని కోరుకుందాం.

## కెరీర్‌లో సక్సెస్ సాధ్యమే

(15వ పేజీ తరువాయి)




అయితే ప్రతికూలవాదులు, ప్రతికూల పరిసరాలు, ప్రతికూల ఆలోచనలు దరి చేరకుండా చూడాలి. 'విజేతల మధ్య మెలగాలి. వారిని ఆదర్శంగా తీసుకోవాలి. వారి నుంచి స్ఫూర్తి పొంది, స్వయం ప్రేరణతో ముందుకు సాగాలి' దీనిని కీడాస్ఫూర్తి అని కూడా అంటారు. మంచి క్రీడాకారులు ఆటను ఆస్వాదిస్తారు తప్ప గెలుపు ఓటములను పెద్దగా పట్టించుకోరు. ఓటమి నుంచి పాఠం నేర్చుకుని గెలుపు సాధించేలా ప్రయత్నం చేస్తారు. అందుకు తగిన నైపుణ్యాలను పెంపొందించుకుంటారు. అలాగే విద్యార్థులు తగిన కోర్సులను లేదా వృత్తిని ఎంచుకుని సంకల్పంతో సాధించాలి. సాధిస్తామన్న సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలి.

### ఒత్తిళ్లను అధిగమించాలి

వ్యక్తిని మానసిక ఒత్తిడి చిత్తు చేస్తుంది. దీర్ఘకాలిక ఒత్తిడి డిప్రెషన్‌కు దారితీస్తుంది. డిప్రెషన్ ఆత్మహత్యలకు ప్రేరకంగా మారుతుంది. మనం ఎంత చక్కగా ఆలోచించి నిర్ణయాలు తీసుకున్నా వాటికి అవరోధాలు, అడ్డంకులు తప్పవు. అంతమాత్రాన కృంగిపోవడం తగదు. పరీక్షల్లో ఫెయిలయ్యామని, మార్కులు తగ్గాయని ఆత్మహత్యలు చేసుకోవడం మంచిదికాదు. ఈలోకంలో ప్రాణం కంటే మించినది మరొకటి లేదు. పోగొట్టుకున్న ప్రతిదాన్ని ఏదో ఒకవిధంగా తిరిగి పొందవచ్చు. అయితే ప్రాణం తిరిగి రాదు అన్న స్పృహ కలిగి ఉండాలి. చచ్చి సాధించేది ఏదీ ఉండదు. బ్రతికి సాధించాలి అంటారు పెద్దలు. కాబట్టి విద్యార్థులు, యువత ఒత్తిళ్ల నిర్వహణ పట్ల అవగాహన పెంచుకోవాలి. తగిన జ్ఞానం, నైపుణ్యాలు పెంచుకోవాలి. సమయపాలన పాటించాలి. శారీరక ఆరోగ్యం పరిరక్షించుకోవాలి. మానవ సంబంధాలు పెంపొందించుకోవాలి. యోగ, ధ్యానం సాధన చేయాలి. విశ్రాంతి, నిద్రకు ప్రాధాన్యత ఇవ్వాలి. నిరంతరం స్వీయప్రేరణతో ముందుకు సాగాలి. అలాంటి వారిని లక్ష్యాలు ముందుకు నడిపిస్తాయి. సంకల్పం గెలిపించి విజయశిఖరాలపై కూర్చోపెడుతుంది.

---

## యాప్ రహిత ఫోన్



స్మార్ట్‌ఫోన్ అంటేనే యాప్‌ల పుట్ట. మరి ఒక్క యాపైనా లేకపోతే? డాయిషే తెలికాం కంపెనీ అలాంటి ప్రయోగాత్మక ఫోన్‌నే ప్రదర్శించింది. అమెరికా అంకురసంస్థ బ్రెయిన్ ఏఐ సహకారంతో రూపొందించిన దీని ఇంటర్ఫేస్ విభిన్నంగా ఉంటుంది. ఇందులో ఒక్కటంటే ఒక్క యాపైనా లేకపోవటం విచిత్రం. ఏఐ ఆధారిత పర్సనల్ అసిస్టెంట్ ఒక్కటే నిక్షిప్తమై ఉంటుంది. ఇదే అన్ని పనులూ చేసి పెడుతుంది. ఇష్టమైన సామాజిక మాధ్యమాల యాప్‌లు లేని ఫోన్‌ని ఊహించుకోవటం కష్టమే గానీ ఆధునాతన ఏఐ రాకతో అప్లికేషన్లకు కాలం చెల్లినట్టే అనిపిస్తోంది. ఆమధ్య వచ్చిన హ్యూమేన్ ఏఐ పరికరం గురించి తెలిసిందే కదా. చొక్కాకు తలిగించుకునే ఇది మాటల ఆదేశాలతోనే కాల్స్‌తో పాటు ఇంటర్నెట్‌తో అన్ని పనులూ చేసేస్తుంది. లేజర్ కాంతి సాయంతో చేతినే తెరలా మార్చేస్తుంది. ఇలాంటి చిత్రవిచిత్రాలు ఇంకా ఎన్ని పుట్టుకొస్తాయో?

## విస్తరిస్తే తెర


ఇప్పటికే మడత ఫోన్లతో అలరిస్తున్న టెక్నో కంపెనీ తాజాగా విస్తరించే తెర ఫోన్‌ను ఆవిష్కరించింది. ఇప్పటివరకూ డెమో వీడియోల్లోనే ప్రదర్శించిన ఈ కన్సెప్ట్‌ను ప్రయోగాత్మక పరికరం రూపంలోకి తీసుకొచ్చింది. దీని పేరు ఫాంటమ్ అల్టిమేటమ్. నిజానికి దీని అసలు తెర సైజు 6.55 అంగుళాలు. కానీ ఫోన్ మీదుండే చిన్న బటన్‌ను నొక్కితే తెర విస్తరిస్తుంది. అప్పుడది 7.11 అంగుళాల తెరగా మారుతుంది. కేవలం 1.3 సెకండ్ల సమయంలోనే తెర విస్తరిస్తుంది. ఇలా ఫోన్ కాస్తా ట్యాబ్లెట్‌లా మారుతుంది.



విస్తరించకుండా ఉన్నప్పుడు ఈ తెర ఫోన్‌కు అవతలి వైపున పరచుకొని ఉంటుంది. అంటే రెండువైపులా తెర ఉంటుందన్న మాట. కాకపోతే అవతలి వైపున తెర అడ్డంగా కనిపిస్తుంది. ఇందులో టైమ్, నోటిఫికేషన్ల వంటివి కనిపిస్తాయి.

## పారదర్శక లాప్‌టాప్

మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ ఒక్క ఫోన్‌లకే పరిమితం కాదు. వినూత్న పీసీలు, ల్యాబ్‌టాప్‌లకూ వేదికే. వీటి విషయంలో లెనోవా సంస్థ అందరి దృష్టిని ఆకర్షించింది. కొన్ని టీవీల మాదిరిగా పూర్తి పారదర్శక తెరతో కూడిన ల్యాప్‌టాప్‌ను ప్రదర్శించింది. దీని సైజు 17 అంగుళాలు. కీబోర్డు స్థానంలోనూ ప్యానెల్‌ను తీసుకొచ్చారు. ఇది వర్చువల్ కీబోర్డులా పనిచేస్తుంది. అలాగే బొమ్మలు గీయటం వంటి పనుల కోసం టచ్‌స్క్రీన్ మాదిరిగానూ ఉపయోగపడుతుంది.



**రా**మం ఇంటి ఆవరణలో అటు ఇటు పచార్లు చేస్తున్నాడు. చలికాలం పోయి ఎండాకాలం వచ్చే రోజులవి. తెల్లవారుతున్నట్టుంది. ఇంటి పక్కనే ఉన్న కాలనీ పార్కు నుంచి పక్షుల కిలకిలారావాలు వినిపిస్తున్నాయి. ఇంటి ఆవరణలో రకరకాల చెట్లు పెంచింది భార్య లలిత. ఒక పక్క బోగన్ విల్లాలు ఇంకో పక్కన రకరకాల క్రోటన్ మొక్కలతో ఆవరణ అంతా నిండిపోయింది. రామానికి ఇష్టమైన నైట్‌క్వీన్ చెట్టు కూడా ఒక పక్కన ఉంది.

కథ

# జీవన సాఫల్యం

బొమ్మిరెడ్డిపల్లి ఇందిర

కొద్దిసేపు పచార్లు చేసి అక్కడే వున్న కుర్చీలో కూచున్నాడు.

ఇంతలో లలిత కాఫీ తీసుకొచ్చి భర్తకిచ్చింది.


రామం కాఫీని కొద్ది కొద్దిగా తాగుతూ శూన్యంలో చూస్తూ ఆలోచిస్తున్నాడు. పాత విషయాలు జ్ఞాపకం వస్తున్నాయి.

రామం ఒక పెద్ద ఇంజినీరింగ్ కంపెనీలో జనరల్ మేనేజర్‌గా పని చేసి పదేళ్ల క్రితం రిటైరు అయ్యాడు. రామం సర్వీసులో ఉన్నప్పుడు చాలా హుషారుగా ఉండేవాడు. ఎక్కడికి ట్రాన్స్‌ఫర్ అయినా హుషారుగా వెళ్లేవాడు. రిటైర్ అయిన తరువాత 5 సంవత్సరాలు ఒక ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలో ప్రిన్సిపాలుగా పని చేశాడు. అలాంటి రామానికి నెల రోజులుగా ఒంట్లో బావుండటం లేదు. రిటైర్ అయిన పది రోజులలో మొదటిసారిగా జబ్బు పడ్డాడు. మందులు తీసుకొంటున్నా నిస్సత్తువ ఆవరించినట్లుంది. ఆరోగ్యం బాగా వున్నప్పుడు రోజూ ఉదయాన్నే కారు తీసుకొని ఇందిరా పార్కుకి వెళ్లేవాడు. కనీసం గంటన్నర పార్కులో తిరిగేవాడు.

అక్కడ రామానికి పది మందిదాకా మిత్రబృందం ఉండేది. రెండు రౌండ్లు నడిచిన తర్వాత మిత్రులతో అరగంట కాలక్షేపం చేసేవాడు. ఆ తర్వాత ఇంట్లో ఎవరో ఒకరు అంటే బంధువులో, మిత్రులో వచ్చేవారు.

రామం ఇల్లు బంధువులకి కేంద్ర స్థానం. తరచూ ఎవరో ఒకళ్లు భోజనానికి రావాల్సిందే. ఎవరూ రాకపోతే కంప్యూటర్లో ఫేస్‌బుక్‌తో కాలక్షేపం చేసేవాడు.

బలహీనత వల్ల ఇప్పుడు ఎక్కడికైనా బయటికి వెళ్లాలంటే భయం భయంగా ఉంటుంది. ధైర్యం చేసి వెళ్లదలచుకొన్నా ఇంట్లోవాళ్లు అసలు ఒప్పుకోరు. మొదట్లో బంధువులు, స్నేహితులు తరచు



చూట్టానికి వచ్చేవారు. ఇప్పుడు అడపా దడపా వస్తున్నారు. అందుకే కాలం చాలా నెమ్మదిగా గడుస్తున్నట్లుంది రామానికి. రామం అంత వాగుడుకాయ కాకపోయినా చురుకుగా ఉంటాడు. అందరితో మాట్లాడుతూ సరదాగా ఉంటాడు. ఉద్యోగంలో చేరిన మొదట్లో ఎప్పుడు ఇంటికొచ్చినా రామంవాళ్ల అమ్మ అనేది "రామం వస్తే ఇల్లంతా కళకళలాడుతుందని, సందడిగా ఉంటుందని". ఇప్పుడు రామానికి మాట్లాడేవారే కరువయ్యారు.

లలిత కూడా ఉద్యోగం చేసేది. 20 ఏళ్లు పని చేసి స్వచ్ఛంద పదవీ విరమణ చేసింది. కాలేజీలో చదివేటప్పుడు ఎంత చలాకీగా ఉండేదో యిప్పుడు అంత మితభాషి అయింది.

రామానికి కాలక్షేపంలో కంపెనీ ఇవ్వలేదు. ఇంట్లో తన పని తాను చేసుకుపోతుంది. ఇక పిల్లలు.. ఇద్దరు కొడుకులు. అందరూ రెండంతస్తుల ఇంట్లో ఉంటున్నా ఎవరికి వారు వారి ఉద్యోగాలు వారి సంసారంతో బిజీగా ఉంటారు. తల్లిదండ్రులతో కాలక్షేపం చేయటం వాళ్లకి అసలు కుదరదు.

రామం లలితలది ప్రేమ వివాహం. వారి వివాహం వారి చదువుతో ముడి పడి ఉంది. అవి రామం ఇంజినీరింగ్ కాలేజీలో చదివే రోజులవి. స్వతహాగా చురుకుగా ఉంటాడు. కాబట్టి కాలేజీలో చాలామంది స్నేహితులయ్యారు. తన క్లాసువాళ్లే కాకుండా సీనియర్లలో కూడా రామానికి స్నేహితులు ఉండేవారు.

చివరి సంవత్సరంలో ఉన్న రామాన్ని మిత్రులందరూ విద్యార్థి సంఘానికి జనరల్ సెక్రటరీగా పోటీ చేయమని చాలా బలవంతం చేశారు.

మొదట్లో తటపటాయించినా ఆఖరికి రామం పోటీ చేయటానికి ఒప్పుకున్నాడు. కానీ ఇంట్లో వ్యతిరేకత ఎదురైంది. తల్లిదండ్రులు అస్సలొప్పుకోలేదు. ఈ పోటీలు చదువుకి ఆటంకంగా మారుతాయని వాళ్ల ఉద్దేశం. మొత్తానికి రామం స్నేహితులు వచ్చి ఒప్పిస్తేనే వాళ్లు ఒప్పుకున్నారు. అలా రామం ఎలక్షన్ బాట పడ్డాడు.

రామం బీఈ చదువు అయిపోగానే బొంబాయిలోని ఐఐటీలోని ఎంటెక్ సీటు వచ్చింది. రెండు సంవత్సరాలు గిర్రున తిరిగాయి. అక్కడే ఒక పెద్ద కంపెనీలో రామానికి మంచి ఉద్యోగం వచ్చింది.

ఎలక్షన్ అంటే మాటలా.. మొదట డబ్బు ఖర్చు పెట్టాలి. అందర్నీ కలవాలి. చాలా టైము ఖర్చు చెయ్యాలి.

కానీ స్నేహితులందరూ అండగా నిలిచి ఉత్సాహపరిచారు. అందరూ తలో బాధ్యత తీసుకొన్నారు. కానీ రామాన్నే అందర్నీ కలిసి మాట్లాడమన్నారు. ఫైనార్ట్స్ కాలేజ్‌లో చదువుతున్న దూరపు బంధువైన రంగా, రామానికి కావాల్సిన ప్రచార సామాగ్రినంతా తయారు చేసి ఇస్తానన్నాడు.

రామం స్నేహితులతో కలిసి అందర్నీ కలవటం మొదలెట్టాడు. ఆ సందర్భంలోనే మూడో సంవత్సరం విద్యార్థులని కలవటానికి వెళ్లాడు.

అప్పుడే లలితని కలిసి మాట్లాడటం అయింది. చూడగానే ఆకర్షించే వ్యక్తిత్వం లలితది. అందంతో పాటు కలుపుగోలుతనంగా చలాకీగా మాట్లాడే పద్ధతి రామానికి చాలా నచ్చింది.

తనే కాకుండా రామానికి మద్దతుగా కాన్వాస్ చేస్తానంది. ఒక విధంగా రామం గ్రూపులో చేరినట్లయింది.

ఇన్ని రోజులూ ఆ అమ్మాయిని తనెందుకు చూడలేదా? అనిపించింది. అప్పుడే తెలిసింది ఆ అమ్మాయి కూడా హిమాయత్‌నగర్‌లోని ఎనిమిదవ వీధిలో ఉంటుందని.

రామం ఉండేది పదవ వీధిలో. ఇంజినీరింగ్ కాలేజీకెళ్లే నంబరు 3డిబస్సు లోనే ఆ అమ్మాయి కూడా కాలేజీకొస్తుందని. తరచు బస్సులో కలిసినా రామం లలిత మీద అంత ధ్యాస పెట్టలేదు. ఎప్పుడూ తన మిత్రులతోను కాలక్షేపం చేసేవాడు. అమ్మాయిల జోలికి అసలు వెళ్లేవాడు కాదు. అటువంటి రామం ఈరోజు లలితని చూడగానే అనిర్వచనీయంగా అనుభూతి చెందాడు.

ఆ రోజంతా రామం హుషారుగా వున్నాడు. ఏదో తెలియని ఆనందంలో మునిగిపోయాడు.

మర్నాడు బస్టాపుకి అరగంట ముందే చేరుకొన్నాడు. కొద్దిసేపట్లో లలిత కూడా వచ్చింది. అలా ఆ రోజు నుంచి వాళ్ల పరిచయం దినదినాభివృద్ధి చెందింది. ఒక్కరోజు కూడా లలితని కలవకుండా వుండలేకపోతున్నాడు.

లలితది కూడా ఇదే పరిస్థితి. నెమ్మదిగా ప్రేమలోకి దారి తీసింది వారి పరిచయం.

ఎలక్షన్లో లలిత కూడా రామం తరపున ప్రచారంలో చురుకుగా పాల్గొంది.

రామం ఎలక్షన్లో గెలిచాడు. చాలామంది లలితకి కూడా అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లో ఆ రోజుల్లో పెద్దదైన రిట్జ్ హోటల్లో విజయాన్ని ఘనంగా జరుపుకొన్నారు.

వారి ప్రేమకి వాళ్ల ఇంట్లోవాళ్లు కూడా అడ్డు చెప్పలేదు.

రామం బీఈ చదువు అయిపోగానే బొంబాయిలోని ఐఐటీలోని ఎంటెక్ సీటు వచ్చింది.

రెండు సంవత్సరాలు గిర్రున తిరిగాయి. అక్కడే ఒక పెద్ద కంపెనీలో రామానికి మంచి ఉద్యోగం వచ్చింది.

లలిత చదువు అయిపోగానే వారి వివాహం జరిగింది. లలితకి కూడా రామం పని చేసే కంపెనీలో ఉద్యోగం వచ్చింది. కాలక్రమేణా ఇద్దరు మగబిడ్డలకి తల్లిదండ్రులయ్యారు.

కాలం వేగంగా గడిచింది. ఇవన్నీ రామానికి సినిమా రీళ్లలా గుర్తుకొచ్చాయి. తాను ఏదో ఒకటి చెయ్యాలి. పూర్వంలా వ్యాపకాలతో మళ్లీ బిజీ అయిపోవాలి అని అనుకొన్నాడు రామం.

మర్నాడు ఉదయాన్నే పక్కనే ఉన్న కాలనీ పార్కుకి వెళ్లాడు. వెళ్లే ముందర తన ఆరోగ్య రీత్యా భార్య అనుమతి తీసుకొన్నాడు.

బావున్నారా సారూ! అంటూ పార్కు వాచ్‌మన్ గోపయ్య గేటు దగ్గరే పలకరించాడు.

బాగానే ఉన్నా.. అని చెబుతూ రామం పార్కులోకి ప్రవేశించాడు. చాలా పెద్ద పార్కు అది. కనీసం అర ఎకరమైనా ఉంటుందనుకొన్నాడు. ఎప్పుడూ వచ్చే పార్కే అయినా చాలా రోజుల తరువాత రావడం వలన కొత్తగా అనిపించింది. కొంతసేపు తిరిగి బెంచీ మీద కూర్చున్నాడు.

పార్కులో అప్పటికే వున్న కాలనీ ప్రెసిడెంటయిన మూర్తి రామాన్ని చూడగానే వచ్చి పక్కనే కూర్చున్నాడు. కుశల ప్రశ్నలు అయిన తర్వాత ఒక ప్రతిపాదన చెప్పారు. కాలనీవాళ్ల యోగాభ్యాసం చెయ్యటం కోసం పార్కులో ఏర్పాట్లు చేస్తే బావుంటుందని.

ఇదంతా దూరం నుంచి వింటున్న వాచ్‌మన్ గోపయ్య పరుగు పరుగున వచ్చి తనదొక ఐడియా చెప్పాడు. కాలనీలోను, చుట్టుపక్కల కాలనీలలోను చాలా మంది పేదవారి పిల్లలు స్కూళ్లకి వెళ్లటం లేదని, వారి కోసం ఉదయాన్నే ఒక గంట వాళ్లకి చదువుకి పార్కులో ఏర్పాటు చేస్తే వావుంటుందన్నాడు.

రామానికి ఈ ఐడియా చాలా నచ్చింది. అదే మాట మూర్తితో అన్నాడు.

తను ఖాళీయే కాబట్టి ఈ బాధ్యతని స్వీకరిస్తానన్నాడు. అదే కాకుండా దానికి కావాల్సిన బ్లాక్ బోర్డు, చాక్‌పీసులు, పిల్లలకి కావాల్సిన పలకలు వగైరా పరికరాలకి తాను ధన సహాయం చేస్తానన్నాడు. పది వేల రూపాయలదాకా సహాయం చేస్తానన్నాడు.

ఇది విన్న వెంటనే కాలనీ ప్రెసిడెంట్ ఈ ప్రతిపాదనని ఒప్పేసుకొన్నాడు. పార్కులో ఒక మూల చెట్ల నీడలో బాగా ఉంటుందని ప్రదేశం కూడా నిశ్చయించేశాడు ప్రెసిడెంటుగారు. పిల్లల్ని తీసుకొచ్చే బాధ్యతని గోపయ్యకి అప్పగించారు. ఒక నోటీసు రాసి పార్కు గేటుకి అతికిస్తానన్నాడు ప్రెసిడెంటు.

ఒక వారం రోజుల్లోపల పార్కులో

పాఠశాల ప్రారంభించాలని నిశ్చయించారు.

రామానికి చాలా ఆనందంగా వుంది. తనకి మంచి కాలక్షేపం అవటమే గాకుండా సంఘానికి కూడా ఎంతో కొంత సేవ చేసినట్లుంటుంది. వెంటనే ఇంటికి వెళ్లి లలితకి ఈ విషయం చెప్పాలి... అనుకుంటూ ఇంటివైపు అడుగులు వేశాడు రామం.

రామం అనుకున్నట్లే లలిత చాలా సంతోషపడింది... భర్తకి వ్యాపకం ఉంటుందని, ఆరోగ్యం మళ్లీ బాగవుతుందనీ, ఎప్పటిలాగా అవుతాడని ఆనందపడింది. వాళ్లు అనుకున్న రోజు వచ్చింది. చదువు చెప్పటానికి కావాల్సిన సామగ్రిని అంతకుముందే ఏర్పాటు చేసుకోవటం వల్ల ఆ రోజు పనులన్నీ చకచకా అయిపోయాయి.

పార్కంతా పిల్లలతోను, వాళ్లతో పాటు వచ్చిన తల్లిదండ్రులతో కిటకిటలాడుతోంది. కాలనీ పాలక మండలి సభ్యులందరు వచ్చారు.

మొదటి రోజు ఆరుగురు పిల్లలు మాత్రమే చదువుకోవడానికి వచ్చారు. వాళ్లందరికీ పలకా, బలపం, బాలవాచకం పుస్తకాలు ఇచ్చాడు రామం.

అది చూసి ఇంకొక్క నలుగురు పిల్లలు వచ్చి కూచున్నారు.

వచ్చిన పిల్లల తల్లిదండ్రులు రామానికి కృతజ్ఞతలు తెలిపారు. అలా ప్రారంభమైంది పార్కుబడి.

మొదట్లో రామానికి కష్టం అనిపించేది... తాను చదివిన చదువు, తాను చేసిన ఉద్యోగం దేనితోనూ సంబంధం లేనిది. తాను చేసే పని గురించి అప్పుడప్పుడు రామం ఫీలయ్యేవాడు. రాను రాను అలవాటైపోయింది.



పొద్దున్నే కాకుండా రోజంతా పిల్లలు వాళ్ల చదువు గురించి ఆలోచిస్తూ రామానికి సమయం తెలిసేది కాదు.

పిల్లల తల్లిదండ్రులు ఎక్కువగా కూలీ నాలీ చేసుకుని పొట్ట పోషించుకొంటున్నారు. వారిలో ఎక్కువ మంది ఇళ్లల్లో పాచిపని చేస్తుంటారు. వాళ్లు రామానికి పెద్ద పబ్లిసిటీ ఇచ్చారు.

పెద్ద ఇంజినీరు సారుట.. చిన్న పిల్లలకి ఉచితంగా చదువు చెప్పటమే కాకుండా పలకలు, పుస్తకాలు అప్పుడప్పుడు చాక్‌లెట్లు, బిస్కెట్లు కూడా ఉచితంగా ఇస్తున్నాడని చుట్టుపక్కల మారుమోగిపోయింది.

అలా ఒక గంట బడితో ప్రారంభమై అనతి కాలంలో రెండు గంటలుగా ఉదయం 7 నుంచి 9 వరకు మార్చబడింది. వర్షాకాలంలో తగిన ఏర్పాట్లు చేస్తామని కాలనీ పాలకమండలి రామానికి భరోసా ఇచ్చింది.

పార్కు బడి గురించి ప్రాంతీయ వార్తాపత్రికలలో కూడా ప్రస్తావించబడింది. ఇప్పుడు రామానికి బోలెడంత కాలక్షేపం.

ఒకరోజు రామానికి ఒక ఫోన్ కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి తనని వెంకటేష్‌గా పరిచయం చేసుకొన్నాడు. ఐఐటీ ప్రవేశ పరీక్షలకి ట్యూషన్ కాలేజి నడిపిస్తున్నాడట. రామం గురించి వార్తాపత్రికలలో చదివాట్ట. రామాన్ని లెక్కల ట్యూషన్ తీసుకోటానికి అభ్యర్థించాడు. రామం ఒప్పుకోలేదు. అయినా కూడా రెండు మూడు సార్లు ఫోన్లు చేసి ఒకరోజు ప్రత్యక్షంగా ఇంటికే వచ్చేశాడు.

రామం ఈసారి లలితని కూడా పిలిచాడు. ఇద్దరూ కలిసి కరాఖండిగా ఆయన అభ్యర్థనని తిరస్కరించారు. కావలిస్తే తమ ఇంటి దగ్గర ఇద్దరు ముగ్గురు విద్యార్థులకి ట్యూషన్ చెప్పటానికి ఒప్పుకొన్నారు. అది కూడా ఉచితంగా చెప్తానన్నారు.

ఆ విధంగా రామం ఇంటి దగ్గర కూడా బిజీ అయిపోయాడు. లలిత కూడా ట్యూషన్లు చెప్పటంలో సహాయపడుతోంది. రామం ఇల్లు ఎంతో సందడిగా కళకళలాడిపోతోంది.

ఇప్పుడు రామం ఆరోగ్యం కూడా బాగయింది. మళ్లీ పూర్వం రామంలా అయిపోయాడు. శూన్యంలో చూస్తూ కూచోటానికి రామానికి సమయం లేదిప్పుడు.

---

# పూల గ్రామం

పూలతోటలు చూడాలనిస్తే మహారాష్ట్రలోని పులాంచా గ్రామానికి వెళ్లాలి. ఆ ఊరి అసలు పేరు నికంవాడి. కానీ నికంవాడి అని చెబితే ఎవరికీ అర్థం కాదు. పులాంచా అంటేనే తెలుస్తుంది అందరికి. పూలతోటలకు ప్రసిద్ధి నికంవాడి. పులాంచా అంటే పూలపల్లె. ఈ గ్రామం నుండి ప్రతిరోజూ ట్రక్కుల కొద్దీ పూలు నగరాలకు రవాణా అవుతుంటాయి.



గతంలో ఈ ఊళ్లోని రైతులు పసుపు, చెరకు పండించేవారు. ఎంత శ్రమపడినా ఆశించిన ఆదాయం వచ్చేది కాదు. కష్టానికి తగిన ఫలితం కూడా లభించేది కాదు.

ఓ వ్యవసాయాధికారి సలహాతో నలుగురైదుగురు రైతులు ధైర్యం చేసి బంతిపూల సాగు చేపట్టారు. తక్కువ సమయంలో ఆదాయం లభించడంతో మిగిలిన రైతులు కూడా పూలసాగు చేపట్టారు. క్రమంగా రెండు వందల ఎకరాల్లో పూలసాగు చేయడం మొదలు పెట్టారు. ఇందులో బంతిపూలతో పాటు చేమంతి పూలను సైతం పండిస్తూ రోజూ పది టన్నులకు



పైగా పూలను ట్రక్కుల్లో నగరాల్లోని మార్కెట్లకు పంపిస్తున్నారు. చేమంతులు

ఏ వేడుక అయినా పువ్వులు లేకుండా పూర్తి కాదు. కనుక పూలసాగు వల్ల ఆదాయానికి ఏమాత్రం కొదవ లేదంటున్నారు పూలాంచా వాసులు. పూల మొక్కల నర్సరీ కూడా నిర్వహిస్తూ చుట్టుపక్కల రైతులు పూలతోటలు పెంచుకోవడానికి సహకరిస్తున్నారు.

# సామెత లేని భాష ఆమేత లేని ఇల్లు

జయసూర్య




**సమాజంలోని దురాచారాలను, చాదస్తాన్ని, దుర్మార్గ ధోరణులను హేళన, వ్యంగ్య రీతిలో, పరిహాసంగా అర్థవంతంగా చెప్పడం వేమన మహాకవి తెలుగు సాహిత్యానికి, మన జీవితానికి ప్రసాదించిన అద్భుతమైన వరం. అనాది కాలం నుండి తెలుగులో సుభాషితాలు, లోకోక్తులు, జనాంతికాలు, సూక్తులు, సామెతలు వ్యవహార రూపంలో ఉన్నాయి.**

పదాలు, పదబంధాలు, వాక్యాలు, పాటలు, పద్యాలు, కథల వివిధ రూపాలలో సామెతలు నిత్య వ్యవహారంలో కనిపిస్తాయి. కులవృత్తులకు సంబంధించి కమ్మరి, కుమ్మరి, కంసాలి, చాకలి, మంగలి, చేనేత వంటివారు, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వివిధ వర్ణాలలోనే కాకుండా మాల, మాదిగ తదితర దళిత, చిన్న సన్న వర్గాల జన సామాన్యం నోట తరచుగా సామెతలు, వ్యంగ్యోక్తులు వినిపిస్తుంటాయి. ప్రసవ సందర్భాలలో కీలకంగా వ్యవహరించిన ఒకప్పటి మంత్రసాని వృత్తులు, సమాజానికి దూరంగా సంచరించే సన్యాసి, బైరాగి జీవితాల సామెతలు తారసపడుతుంటాయి. రక్తి అయినా విరక్తి అయినా మాటలలో, పదాలలో, పాటలలో, గీతాలలో తంబుర నాదాలతో అద్భుతంగా ఎన్నో జీవన సత్యాలు ప్రతిధ్వనిస్తుంటాయి. రాతపూర్వకంగానే కాకుండా, మౌఖికంగా జన సామాన్యం, పామరుల నోట వినపడే సాహిత్యం, వ్యవహారికంగాను, మాటలలో అనుభవాలను, శాశ్వత సత్యాలను ఆవిష్కరిస్తుంటాయి. నిరంతరం జన నానుడిలో చెలామణి అయ్యే సామెతలు భాష, పలుకుబడులే కాకుండా భావాలను, సమయం, సందర్భాన్ని అనుసరించి అందించడంలో విశేష ప్రజ్ఞ కలిగి వుంటాయి. నొప్పించకుండా, నిందించకుండా, దుర్భాషల రూపంలో కాకుండా ఎంతటివారైనా లోలోన నవ్వుకొంటూ స్వీకరించగల ఉన్నత లక్షణాలు హాస్య భావ ఉత్తేజం, ఎంతటి కటువైన విషయమైనా మెత్తగా చెప్పగలగడం వీటికే చెల్లింది. సన్నివేశానికి, సందర్భానికి అనుగుణంగా నీతిబోధకాలుగా సామెతల జోడింపుతో ప్రసంగాలలో, వాద వివాదాలలో, సంభాషణలలో అర్థ స్ఫూర్తి అందిస్తుంది. ఉపన్యాస కళకు ప్రత్యేకంగా నైపుణ్యత అందిస్తాయి.

సంక్షిప్తత, అల్పాక్షరాలలో అనల్పార్థం స్ఫురింపచేయడం, లోకానుభవ వ్యక్తీకరణ, దేశీయ పదాల స్వచ్ఛత సమ్మిళితమైన సామెతలు, ప్రాపంచిక విలువల జ్ఞానాన్ని, సూత్రాలను, వేదాంత తత్త్వాలను అతి తేలికగా మరుక్షణంలో గ్రహించగలిగే స్ఫూర్తి అందిస్తున్నాయి.

తెలుగు భాషకే సొంతమై, తెలుగు జన సంస్కృతి సంప్రదాయాలను ఎల్లవేళలా పరిరక్షించే సామెతలు బతికితే భాష సజీవంగా కొనసాగుతుంది.

సామాజిక స్వభావం, తీరుతెన్నులు సామెతలలో ఒదిగిపోతాయి. ప్రస్తుత భాషా సాంక్రమికం కారణంగా, సంకర తెలుగులో సామెతలు కనుమరుగవుతున్నాయి. కుటుంబాలలో పెద్దలు, అనుభవజ్ఞులు మాట్లాడే భాష, ముఖ్యంగా తెలుగు యువతరం అర్థం చేసుకోగల ఆలోచనలు దూరం అవుతున్నాయి. దానికితోడు సామాజిక స్వరూపం, అత్యంత ఆధునికం, సాంకేతికం కావడంతో జీవన శైలి మారిపోతోంది. మాటకే ప్రాధాన్యత తగ్గిపోతుంటే, తెలుగు పలుకుబడి క్షీణిస్తుంటే ఇక సామెతలు, లోకోక్తులు సహజంగా మరుగున పడిపోవడం తప్పదు.

సామెత లేని మాట ఆమెత(విందు) లేని ఇల్లు అంటూ పెద్దలు ఒక సామెత చెప్పారు. అగ్గిపెట్టెలో ఇమిడే చీరను నేసిన ప్రతిభగల చేనేత వృత్తికి సంబధించిన 'చంద్రుడికో నూలు పోగు', గీత వృత్తికి చెందిన 'ఈత చెట్టు కింద పాలు తాగితే కల్లే'.

'తాడి తన్నువాని తల తన్నేవాడు', విశ్వకర్మ వృత్తులకు సంబంధించిన 'కంచు మోగినట్లు కనకమ్ము మ్రోగునా', 'కమ్మరి వీధిన సూదులమ్మినట్లు', కుమ్మరి వృత్తికి చెందిన 'చల్లకు వచ్చి ముంత దాచనేలా', 'కుడితే తేలు కుట్టకపోతే కుమ్మరి పురుగు', చాకలి వృత్తికి సంబంధించి 'చద్దిమూటలో సారం చాకలికి తెలుసు', కటిక వృత్తి గురించి 'మేక కసాయివాన్ని నమ్ముతుంది' వంటి సామెతలు తెలుగు పల్లెల కుల వృత్తులను గుర్తు చేస్తాయి. సామెతలు ఇంకా అసంఖ్యాకంగా వున్నాయి.

సాధారణంగా ప్రచారంలో వున్న 'చెప్పేవి శ్రీరంగ నీతులు దూరేవి దొమ్మరి గుడిసెలు', 'మంత్రసాని పనికి ఒప్పుకున్నప్పుడు బిడ్డ వచ్చినా, ఏది వచ్చినా పట్టాలి' 'సూది గొంతు బాన కడుపు', 'సన్యాసి సన్యాసి రాసుకొంటే బూడిద రాలిందట', 'పండిత పుత్ర పరమశుంఠ', 'తులసివనంలో గంజాయి మొక్క మొలచినట్లు', ఎన్నో సామెతలు తెలుగు భాషకు మణిమయ అలంకారాలుగా శోభిల్లుతున్నాయి. సుమతీ, భర్తృహరి, వేమన, కుమారి, భాస్కర, కృష్ణ, దాశరథి వంటి శతక సాహిత్యంలో భాష, భావ, ఆధ్యాత్మిక, దైనందిన వ్యవహార పరంగా సామాజిక ప్రయోజనం జోడించిన అనర్ఘ రత్నాల అమృత పలుకుబడి భవిష్య తరాలకు పదిలంగా అందించగలమా?

పుస్తకాలలో, పద్యాలలో వివిధ రచనలలో పూర్వపు మేధావంతులు సృష్టించిన సామెతలే కాకుండా, తెలుగునాట పల్లెలలో పామర జనంనోట, సందర్భానుసారంగా వెలువడి ఆ నోటా ఈ నోటా ప్రాచుర్యం పొందే ఆసక్తికరమైన, అర్థవంతమైన సామెతల ఇతివృత్త కథనాలు విశేషంగా సాహిత్యంలో చోటు చేసుకొన్నాయి. ముఖ్యంగా బాల సాహిత్యంలో వినోద, విజ్ఞాన, నీతి ప్రబోధాత్మకంగా ఎంతో సాహిత్యం వెల్లివిరుస్తోంది. హాస్య గుళికలుగా ప్రేక్షకులను ఆకట్టుకోగల సంభాషణలలో, నాటకీయత పుట్టిపడే భావజాలం ఇమిడివుండే ఈ ప్రక్రియ సృజనాత్మకంగా తెలుగు సాహిత్యాన్ని జనరంజకంగా ప్రభావితం చేస్తోంది. చదువరికైనా, శ్రోతకైనా, ప్రేక్షకునినైనా హాస్య, వ్యంగ్య, తటిల్లత వెలుగు అందించగల సామెతలు సాహిత్యంలో రసగుళికలుగా ఆస్వాదించవలసినదే!

# పంటినొప్పి-దేశభక్తి

యామిజాల జగదీశ్

ఒక మిత్రుడు వచ్చాడు. అతనికి దేశభక్తి చాలా ఎక్కువ. దైవభక్తి కంటే దేశభక్తి ఎంతో ముఖ్యమైనదని తరచూ అంటుంటాడు. ఏదో మాటవరకు చెప్పడం కాదు. అలా ఆచరించిన సందర్భాలు ఉన్నాయి. నిజంగానే దేశభక్తి ఉన్నవాళ్లు ఉన్నారు.

దేశభక్తి ఉన్నట్టు అవీ ఇవీ చేస్తూ అలా అనిపించుకున్నవాళ్లూ ఉన్నారని నేనొకమారు అతనితో చెప్పాను. అప్పుడు అతను నాకో కథ చెప్పాడు. ఇది పోలెండ్ దేశానికి చెందిన ఓ చిన్న కథ.

ఆ ఊళ్లో ఓ పెద్ద మనిషి ఉండేవాడు. అతను వయోవృద్ధుడు. అలాగే బాగా ఉన్నవాడు. సకల సౌకర్యాలూ ఉన్నాయి. అయితే అతనికి ఓ సమస్య. అదేమిటంటే పంటినొప్పి.

ఓ పిప్పిపన్ను చాలా కాలంగా అతనిని ఇబ్బంది పెడుతోంది. చాలా కష్టపడుతున్నాడు. ఏం చేయాలి! అని ఆలోచించాడు. ఒకరోజు నౌకరుని పిలిచాడు. "పరుగున వెళ్లి పంటి డాక్టరుని తీసుకురా" అని అన్నాడు. సరేనని నౌకరు వెళ్లి డాక్టరుని తీసుకొచ్చాడు.

పంటి డాక్టరు వచ్చారు. అప్పటి వరకూ ఎవరికీ పంటిని చూపించని ఆ పెద్దాయన మొదటిసారిగా డాక్టరుకి నోరు తెరిచి ఇబ్బంది పెడుతున్న పంటిని చూపించాడు. డాక్టరు అది చూసి "దానిని తీసెయ్యడమే మంచిది" అన్నాడు. ఇలా డాక్టరు చెబుతున్న సమయంలోనే మరొక దేశపు(రష్యా) దళపతి ఈ వృద్ధుడిని వెతుక్కుంటూ వచ్చాడు.

వెంటనే వృద్ధుడు ఆలోచించాడు. ఆ పంటి డాక్టరుని చూసి "డాక్టరుగారూ, మీరు కాస్సేపు పక్క గదిలో ఉండండి. నేను పిలిచినప్పుడు వస్తే చాలు" అన్నాడు.

రష్యాకు చెందిన దళపతి వచ్చాడు. అతనితో మాటలు మొదలు పెట్టాడు ఆ వృద్ధుడు.

"మీ దేశంలో ప్రతి ఒక్కరికీ దేశభక్తి ఉన్నట్టు ఏదో ఒకటి చేసి చెప్తూ ఉంటారు. కానీ మీ కన్నా మాకే ఎక్కువ దేశభక్తి ఎక్కువ. ఆ విషయాన్ని ఇప్పుడీ క్షణంలో నేను నిరూపించగలను" అన్నాడు.

"ఆ విషయాన్ని ఎలా నిరూపించుకుంటారు?" అని అడిగాడు రష్యా దళపతి.

"ఇదిగో చూడండి.. మేం దేశభక్తి ఉందనడానికి ఏదైనా చేస్తాం. దేన్నయినా త్యాగం చేయడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటాం" అన్నాడు.

"అవునా?" అని అడిగాడు దళపతి.

"మాటలు వినడానికి బాగానే ఉన్నాయి. చేసి చూపించండి" అన్నాడు దళపతి.

వెంటనే పెద్దాయన పక్క గదిలో ఉన్న పంటి డాక్టరుని పిలిపించాడు. డాక్టరూ వచ్చాడు.

"ఇదిగో చూడండి.. ఇప్పుడు దేశభక్తిని నిరూపించబోతున్నాను. ఇదిగో చూడండి... ఒక పంటిని త్యాగం చెయ్యబోతున్నాను.



డాక్టరుగారూ! నా నోట్లోంచి ఒక పన్నుని పీకండి" అన్నాడు వృద్ధుడు.

పంటి డాక్టరు విషయం అర్థం చేసుకున్నాడు. ఆయన సరిగ్గా పిప్పి పన్నుని పీకేశారు.

అది చూసి రష్యా దళపతికి ఒకింత కోపం వచ్చింది. అసూయా పుట్టింది. రోషం పొంగుకొచ్చింది. ఇద్దరి వంకా చూశాడు.

"ఇదిగో చూడండి.. నేనూ దేశభక్తిలో మీ కంటే ఒక మెట్టు పైనున్నాను. డాక్టరుగారూ, ఆయన ఒక పంటినే త్యాగం చేశాడు. నేనిప్పుడు రెండు పళ్లను త్యాగం చేయబోతున్నాను" అన్నాడు.

వైద్యుడు ఆలోచించాడు. అయినా నాదేముంది... పన్ను పీకడం వల్ల డాక్టరుకేమైనా నొప్పి కలుగుతుందా? లేదుగా.. అనుకుంటూ దళపతి నోట్లోంచి రెండు దంతాలను తీసేశాడు డాక్టరు.

డాక్టరు వెళ్లిపోయిన తర్వాత రష్యా దళపతి వృద్ధుడితో "చూసేరా.. నా దేశభక్తి ఎలాంటిదో! మీరు ఒక్క పన్నునే వదులుకున్నారు. కానీ నేను రెండు పళ్లను దానం చేశాను" అని చెప్పాడు.

ఇరుగు-పొరుగువాళ్లు వచ్చి వారిని చూశారు. ఇదేనండీ వృద్ధ మిత్రుడు చెప్పిన కథ.

ఆలోచించండి... దేశ భక్తి తనకు ఉందని భక్తిని ఇట్లాగా చూపడం! అది దేశభక్తి అవుతుందా. నిజమైన దేశభక్తి ఉంటేనే స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నవారి యథార్థ కథలు మనసును హత్తుకుంటాయి. అంతేతప్ప తమకూ దేశభక్తి ఉందని నలుగురికీ తెలిసేటట్టు ఏదో ఒకటి చేయడం దేశభక్తి అనిపించుకోదు. ఎండవేడిమిలో ఉన్నవారికే చెట్టునీడ, చల్లగాలి గొప్పతనం తెలిసొస్తాయి. ప్రజాస్వామ్యం గొప్పతనం స్వాతంత్ర్య పోరాటాల గురించి క్షుణ్ణంగా తెలిసిన వారికే గొప్ప అనుభూతి మిగులుస్తుంది.

అధికారం తాండవిస్తున్న దేశంలో ఒక వ్యక్తికి పంటినొప్పి తీవ్రంగా ఉంది. అతను పక్కనున్న దేశానికి వెళ్లాడు. ఆ దేశం ప్రజాస్వామ్య దేశం. అక్కడ ఓ డాక్టరుని కలిసి తన పంటి నొప్పి గురించి చెప్పాడు.

అప్పుడా డాక్టరు "అదేమిటీ? మీ దేశంలో పంటి డాక్టరు లేడా? ఇందుకోసం మీరు అక్కడి నుంచి ఇక్కడకు వచ్చారా?" అని అన్నాడు.

"మా దేశంలో పంటి డాక్టర్లు ఉన్నారు. లేకేమీ కాదు. అయినా అక్కడ మేం నోరు తెరవడానికి ఆస్కారమే లేదు. మాది నియంత దేశం. అసలు మేం నోరు తెరిస్తే ఒట్టు.

అందుకే మీ దగ్గరకు వచ్చాను" అన్నాడా వ్యక్తి.

సింగిల్ పేజీ కథ

# గుడిగంటలు మోగాయి

సరిపల్లి వేంకటరశ్మి

అర్ధరాత్రి పన్నెండు గంటలు కావస్తోంది. అభయ్ అడవంతా తిరుగుతున్నాడు. వింత వింత శబ్దాలేవో చెవులను తాకుతున్నాయి. నా గతేం కాను?" అని సందిగ్ధావస్థలో పడ్డాడు అభయ్.

......

అభయ్ చాలా సిన్సియర్. తండ్రి సూర్యనారాయణ ఒక ప్రైవేటు ఇన్‌స్టిట్యూట్‌లో క్లర్కుగా పని చేస్తున్నాడు. రెండు సంవత్సరాల తరువాత వాళ్లకు కొడుకు పుట్టాడు. తననో ప్రయోజకుణ్ణి చేయాలని తల్లిదండ్రులెంతగా కష్టపడుతున్నారో అర్థం చేసుకున్నాడు అభయ్. ఎంసెట్ టాప్ ర్యాంక్ తెచ్చుకుని, బీటెక్ కంప్యూటర్ సైన్స్‌లో జాయినయ్యాడు. క్యాంపస్ ఇంటర్వ్యూలో సెలక్టయి ఓ కార్పొరేట్ సంస్థలో ఉద్యోగం సంపాదించి కన్నవాళ్ల కలలు నిజం చేసాడు. మాన్పించేసాడు.

సొంతింటి కలను సాకారం చేసుకోవాలన్న ప్రయత్నంలో ఉన్నాడు. కొడుక్కి పెళ్లి చేసారు. చైత్ర పిజి చేసింది. కుందనపు బొమ్మలా ఉంటుంది.

......

మూడు సంవత్సరాలు నిండిన కొడుకు స్మరణ్‌ని స్కూల్లో చేర్పించారు చైత్రా అభయ్‌లు. కొన్నాళ్లకు పాప పుట్టింది. శ్రావ్య అని ముద్దుగా పేరు పెట్టుకున్నారు. పిల్లలిద్దరితో అందరికీ చక్కగా కాలక్షేపం అయిపోతోంది. రోజులు బాగానే గడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో అభయ్ నెత్తిన పిడుగు పడ్డట్టయింది.

......

ఒకరోజు సాయంత్రం గుండె పట్టుకుని విలవిల్లాడిపోతున్నాడు సూర్యనారాయణ. ఇద్దరు పిల్లలను అనసూయమ్మకు అప్పగించి కొడుకూ కోడలు సూర్యనారాయణను హుటాహుటిన హాస్పిటల్‌కి తీసుకెళ్లి అడ్మిట్ చేసేసారు.

డా॥ భరద్వాజ్ టెస్టులన్నీ చేయించి "ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించాలి. లేదంటే ప్రాణాలకే ప్రమాదం. పాతిక లక్షల దాకా ఖర్చవుతుంది" అని చెప్పటంతో అభయ్ అడ్వాన్స్‌గా కట్టాల్సిన ఐదు లక్షలు కట్టేసి డిశ్చార్జ్ సమయంలో కట్టాల్సిన ఇరవై లక్షల గురించి ఆలోచనలో పడ్డాడు. కూడబెట్టిన సొమ్మంతా కలిపితే ఓ మూడు లక్షల దాకా జమయింది. ఫ్రెండ్స్ నుండి మరో రెండు లక్షలు జమ చేయగలిగాడు. మరుసటి రోజే ఆపరేషన్ డిసైడ్ చేసాడు డా॥ భరద్వాజ్.



మరుసటి రోజు ఉదయం హాస్పిటల్‌లో తల పట్టుకుని కూర్చున్నాడు అభయ్. ఎంతో కష్టపడి నన్నింతవాడిని చేసిన నాన్నకి రేపొద్దున్న ఏమైనా అయితే మా గతేంకాను? భగవంతునిపై భారం వేయడం తప్ప నేనేం చేయగలను?" అనుకుంటూనే మరోపక్క ఇరవై లక్షలు ఎలా తేవాలని ఆలోచిస్తుంటే–

"సార్....సార్.." అంటూ వార్డ్ బాయ్ చేత్తో పేపరొకటి పట్టుకునివచ్చి తన ముందు నిలబడ్డాడు. భారంగా తలపైకెత్తాడు అభయ్. "మీ కల నెరవేరే మార్గం సార్" అంటూ న్యూస్ పేపర్ చేతికందించాడు.

కళ్లు తుడుచుకుంటూ "ఈ న్యూస్ ఏమిటబ్బా?" అనుకుంటూ శ్రద్ధగా చదవడం మొదలుపెట్టాడు.

"భయంకరమైన అడవిలో రాత్రంతా తిరిగి ధైర్యంగా అందరికంటే ముందొచ్చిన వాళ్లకి పాతిక లక్షల నగదు బహుమానం. నేటి రాత్రే ఈ పోటీ. పాల్గొనే వాళ్లు వెంటనే తమ తమ పేర్లు నమోదు చేసుకోవాలి" అంటూ ఓ ప్రసిద్ధ టీవీ చానల్ వాళ్ల ప్రకటన.

వార్డ్ బాయ్ అభయ్‌కి ధైర్యం ఎంతగానో ప్రోత్సహించాడు. తల్లికీ భార్యకీ చెబితే ససేమిరా ఒప్పుకోరని తెలిసి విషయం చెప్పకుండా "ఎలాగోలా ప్రయత్నించి డబ్బు తీసుకొస్తా. మీరు పెద్దాయనను దగ్గరుండి జాగ్రత్తగా చూసుకోండి" అంటూ హుటాహుటిన అడుగు బయట పెట్టాడు అభయ్. ప్రకటనలో ఇచ్చిన అడ్రస్, ఫోన్ నంబర్ల ఆధారంగా అక్కడకు వెళ్లాడు. అక్కడంతా కోలాహలంగా ఉంది. నిర్వాహకులను కలసి "సార్! నేను పార్టిసిపేట్ చేస్తాను. అవకాశం కల్పించండి" అంటూ రిక్వెస్టు చేసాడు.

"ఇప్పటికే పార్టిసిపేట్ చేసేవాళ్ల పేర్లన్నీ ఖరారైపోయాయి. ఎవరైనా ఒకరు పార్టిసిపేట్ చేయలేని పక్షంలో మీకు అవకాశం కల్పిస్తాం" అని వాళ్లన్నారు. దైవం తన పక్షాన ఉండడంతో అభయ్‌కి పోటీలో పాల్గొనే అవకాశం దక్కింది.

"నా ఇష్టపూర్వకంగానే ఈ పోటీలో పాల్గొంటున్నాను. ఇందులో ఎవరి ప్రోద్బలం లేదు. నాకు ఏం జరిగినా నేనే బాధ్యుడినని లిఖితపూర్వక హామీనిస్తున్నాను" అంటూ ఒప్పంద పత్రం రాయించుకుని అభయ్‌చేత సంతకం తీసుకున్నారు.

"ఆకలేస్తోందా?" అనడగడంతో "లేదండీ" అని బదులిచ్చాడు. "ఆకలేసినప్పుడు తిందువుగానీ" అంటూ ఉప్మా బాక్స్, వాటర్ బాటిల్ అతనికందించి అభయ్‌ని అడవిలో ఒంటరిగా వదిలిపెట్టారు నిర్వాహకులు.

......

"దేవుడా.. నాకు దిక్కేది?" అని ఆలోచిస్తుంటే ఎదురుగా వార్డ్‌బాయ్ కనిపించాడు.

"నాకీ అడవంతా బాగా తెలుసు సార్" అంటూ అడవంతా తిప్పి అందరికంటే ముందుగా గమ్యం చేర్చాడు. అభయ్ ధైర్యసాహసాలను అభినందిస్తూ అతణ్ణి జయ జయ ధ్వానాలతో స్టేజి వద్దకు తీసుకువెళ్లారు. ఓ ప్రముఖ పారిశ్రామికవేత్త చేతుల మీదుగా మెమెంటో, ప్రశంసా పత్రాలతో పాటు పాతిక లక్షల చెక్ అతని చేతిలో పెట్టారు. అభయ్ కళ్లు ఆనందంతో చెమ్మగిల్లాయి. ప్రాంగణమంతా కరతాళ ధ్వనులతో మారుమోగిపోయింది.

తండ్రి గుండె ఆపరేషన్ సక్సెస్ కావడంతో డా॥ భరద్వాజ్‌కు కృతజ్ఞతా పూర్వకంగా చేతులెత్తి దండం పెట్టారు కుటుంబ సభ్యులు. ఇంతకీ వార్డ్ బాయ్ ఎక్కడున్నాడు అనుకుంటూ అంతా కలయచూసాడు. ఇంతలో అతడు తారసపడడంతో "థాంక్స్ బాబూ! నువ్వడవంతా తిప్పకపోతే నేనీ పోటీలో క్యాష్ ప్రైజ్ గెలుచుకునేవాడినే కాదు. ఏమిచ్చినా నీ రుణం తీర్చుకోలేను" అన్నాడు అభయ్.

"నేను ప్రకటన విషయం చెప్పాను, అంతకుమించి నేనేమీ చేయలేదు. నేను ఊళ్లోనే లేను" అనగానే విస్తుపోయాడు అభయ్. అప్పుడే దగ్గరలో ఉన్న గుళ్లో నుండి గణగణ గంటలు వినిపించాయి. భక్తిపూర్వకంగా కళ్లు మూసుకున్నాడు. అప్పుడర్థమైంది అభయ్‌కి... ఇప్పటివరకు తననింతగా ఆదుకున్నదెవరో! ✦

# సమస్యలను తొలగించే సుబ్బరాయుడు

ఇలపావులూరి వెంకటేశ్వర్లు

ఆలయదర్శనం

యావత్ భారతదేశంలో తమిళనాడుతో పోలిస్తే మిగిలిన రాష్ట్రాలలో ఆది దంపతుల ద్వితీయ పుత్రుడు దేవసేనాని అయిన శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆరాధన తక్కువ అనే చెప్పుకోవాలి. తమిళనాడులో శ్రీ కుమారస్వామి కొలువైన ప్రముఖ



క్షేత్రాలైన ఆరు పాడై వీడుతో సహా అనే ఆలయాలు ప్రతి ఒక్క జిల్లాలో కనపడతాయి. అంతేకాదు.. ప్రతి ఒక్క శైవ క్షేత్రంలో తప్పనిసరిగా ఒక్కటయినా శ్రీ వల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య సన్నిధి కనపడుతుంది. సంగమ కాల సాహిత్యంలో కూడా శ్రీ కార్తికేయ ప్రస్తావన అనేక చోట్ల కనపడుతుంది. ప్రముఖ కవి అరుణగిరినాథర్ తన ఆరాధ్య దైవం అయిన శ్రీ షణ్ముఖుని కీర్తిస్తూ అనేక వేల కీర్తనలు రచించి గానం చేశారు అని తెలుస్తోంది.

శ్రీ కార్తికేయ, శ్రీ షణ్ముఖ, శ్రీ ఆర్ముగ, శ్రీ ఆండవర్, శ్రీ దండాయుధపాణి, శ్రీ వేలాయుధం, శ్రీ స్కంద, శ్రీ మురుగన్.. ఇలా ఎన్నో పేర్లతో తమ ఆరాధ్య దైవాన్ని కొలుచుకొంటారు. తమ పిల్లలకు ఆ పేర్లను పెట్టి ప్రేమతో పిలుచుకొంటారు. వారికి దేవసేనాని పట్ల ఇంతటి గౌరవాభిమానాలు ఉండటానికి కారణం ఆయన ఆదేశం మేరకే అగస్త్య మహర్షి పొదిగై పర్వతాలలో ఉంది. దేవ భాష సంస్కృతంతో పాటు తమిళ భాష రూపొందించారన్న నమ్మకమే. అంతేకాకుండా శ్రీ షణ్ముఖుడు జ్ఞాన ప్రదాన అన్న విశ్వాసం కూడా ప్రధానమైనది.

తమిళనాడు అంత కాకున్నా దక్షిణాదిలో కర్ణాటక రాష్ట్రంలో కూడా విశేష శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలు కనపడతాయి. శ్రీ కుక్కె సుబ్రహ్మణ్య స్వామి ఆలయం వాటిలో అగ్ర స్థానంలో ఉంది.

కేరళలో మహేశ్వరుడు, వైకుంఠవాసుడు, శ్రీ భగవతి అమ్మవారి తరువాత శ్రీ ధర్మశాస్త అధిక ప్రాధాన్యం కలిగిన దైవం. చాలా కొద్ది చోట్ల శ్రీ సుబ్రహ్మణ్య క్షేత్రాలు కనపడతాయి.

ఇక మన రాష్ట్రంలో రాహు-కేతు పరిహార పూజలు, సర్ప దోషాల నివారణార్థం, కుజ దోషం తొలగిపోవడానికి, కల్యాణం కోసం, సంతానం కోవడానికి.. ఇలా సుబ్రహ్మణ్య స్వామి ఆరాధన జరుగుతుంటుంది.

మన రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ ఒక విశేష శ్రీ సుబ్రహ్మణ్య స్వామి క్షేత్రం స్థానికంగా భక్తుల ఆదరణ పొందుతున్నది అంటే ఆశ్చర్యం కలుగుతుంది. సింగరాయపాలెం, కృష్ణా జిల్లా, బిక్కవోలు, తూర్పు గోదావరి జిల్లా, అత్తిలి, పశ్చిమ గోదావరి జిల్లా, ఫజుల్లాబాద్, గోకవరం దగ్గర, తూర్పు గోదావరి జిల్లా, మల్లం, నెల్లూరు జిల్లా, పంపెనోరు, అనంతపురం జిల్లా, చెంగలరాయకొండా, చిత్తూరు, ఫ్యూల్బాగ్, విజయనగరం, చోడవరం, విశాఖ జిల్లా, నాగుల మడక, ప్రముఖ శ్రీ శనీశ్వర క్షేత్రం పావగడ దగ్గర, అనంతపురం జిల్లాలో వీటిల్లో కొన్ని.

కానీ ప్రథమ స్థానంలో ఉన్నది కృష్ణా జిల్లాలోని మోపిదేవి. ఆ తర్వాత స్థానం కర్నూలు జిల్లాలోని శ్రీ సుబ్బరాయ కొత్తూరు అని ఘంటాపథంగా చెప్పవచ్చు.

ముఖ్యంగా ఆదివారాలు, మంగళవారాలు, శ్రీ సుబ్రహ్మణ్య క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడిపోతాయి అంటే అతిశయోక్తి లేదు. నంద్యాల పట్టణానికి సమీపంలోని శ్రీ సుబ్బరాయ కొత్తూరు (ఎస్.కొత్తూరు) అనేక ప్రత్యేకతలు కలిగి ఉన్నది.

## ఆలయ పురాణ గాథ

ఈ క్షేత్ర గాథ సుమారు అయిదు వందల సంవత్సరాల నాటిదిగా తెలుస్తోంది. గతంలో ఈ గ్రామంలో బీరం చెన్నారెడ్డి అనే పేద రైతు ఉండేవారట. వరుసగా కొన్ని సంవత్సరాల పాటు వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు పడలేదు. మాఘ శుద్ధ షష్టినాడు ఒక శుభ సమయంలో పొలాన్ని అరకతో దున్నితే పంటలు చక్కగా పండి, కష్టాలు తొలగిపోతాయని సాధువు తెలిపారట.

వరదనీటిలో కొట్టుకొనిపోతున్నవారు చిన్న గడ్డిపరక దొరికినా వదలరు అన్నట్లుగా సాధువు మాటలను సంపూర్ణంగా విశ్వసించిన చెన్నారెడ్డి నిర్ణయించిన ముహూర్తానికి పొలం దున్నడానికి సిద్ధపడగా కొద్దిగా ముందుకు వెళ్లిన అరక ఆగిపోయింది.

ఎన్ని ప్రయత్నాలు చేసినా అరక కదలలేదు. చెన్నారెడ్డి దిక్కు తోచక తన కులదైవమైన పరమేశ్వరుణ్ని ప్రార్థించారు. అకస్మాత్తుగా ఆకాశంలో ఒక మెరుపు మెరిసి ఆకాశంలో ఒక మెరుపు మెరిసి ఆ వెలుగులో ద్వాదశ పడగల పెద్ద సర్పం దర్శనమిచ్చింది. ఆ కాంతికి రెడ్డి దృష్టి కోల్పోయాడు. మెరుపు శబ్దానికి తరలి వచ్చిన గ్రామస్తులు అతి కష్టంగా అరకను వెలుపలికి తీయగా దానితో పాటు పన్నెండు పడగల నాగేంద్రుని విగ్రహం వచ్చిందట.

గ్రామస్థులు నిర్ఘాంతపోయి స్తోత్ర ప్రార్థనలు చేయడం ప్రారంభించారు. ఆ పరిస్థితులలో అక్కడికి పూర్వం ఏ సాధువు చెన్నారెడ్డి పొలం దున్నడానికి ముహూర్తం పెట్టారో ఆయన వచ్చాడు.

తరుణోపాయం చెప్పమని అర్థించిన గ్రామస్థులకు ఊరట కలిగిస్తూ "మూడు రోజుల పాటు నాగేంద్ర స్వామి విగ్రహానికి నిరంతరం పాలాభిషేకం చేయండి. చెన్నారెడ్డికి దృష్టి వస్తుంది. తరువాత సాయం సంధ్యా సమయంలో మొదలుపెట్టి తొలి కోడి కూసే లోపల ఆలయం నిర్మించండి. గ్రామానికి మంచి రోజులు వస్తాయి. శ్రీ సుబ్రహ్మణ్య స్వామి స్వయంవ్యక్తగా వెలసిన ఊరు శ్రీ సుబ్బరాయ కొత్తూరుగా ప్రసిద్ధి చెందుతుంది" అని సెలవిచ్చారట సాధువు.

మూడు రోజుల అఖండ క్షీరాభిషేకం తరువాత చెన్నారెడ్డికి పోయిన చూపు తిరిగి వచ్చింది. ఇనుమడించిన భక్తి శ్రద్ధలతో విగ్రహం మధ్యలో ఉంచి ఆలయ నిర్మాణం ప్రారంభించారు గ్రామస్థులు. తొలి కోడి కూసే వేళకు ప్రహరీ గోడలు మాత్రమే సిద్ధమయ్యాయి. అందువల్ల గోపురం లేకుండానే ఉంటుంది ఆలయం. పైకప్పు నిర్మిస్తే ఏడుగురు బలి అవుతారని స్వామి చెప్పారని విశ్వాసం. అనంతర కాలంలో ఆలయ ప్రాముఖ్యం తెలియడంతో అభివృద్ధి చెంది ప్రస్తుత రూపు సంతరించుకొన్నది.

## ఆలయ విశేషాలు

తూర్పున చిన్న రాజగోపురం నిర్మించారు. ప్రాంగణంలో వేప చెట్టు కింద ఎన్నో నాగశిల్పాలు భక్తులు ప్రతిష్టించినవి కనిపిస్తాయి. గోపురం లేని గర్భాలయంలో ద్వాదశ శిరస్సుల నాగ రూపంలో శ్రీ సుబ్బరాయుడు దర్శనమిస్తారు. నిరంతర అభిషేకాల కారణంగా మూర్తి చెదరకుండా ఉండటానికి ప్రస్తుతం కవచం కప్పి ఉంచుతున్నారు. ప్రాంగణంలో లింగరాజు, లోకమాత పార్వతీదేవి సన్నిధులు కనిపిస్తాయి. కేశఖండన శాల, స్నానాలకు తగిన ఏర్పాట్లు ఉంటాయి.

ఆలయ ఆధ్వర్యంలో భక్తులకు నిత్యం ఉచిత అన్న ప్రసాద వితరణ జరుగుతుంది.

## ఆదివారం సెలవు

ఆదివారం సెలవే కదా అంటారా?

సుబ్బరాయ కొత్తూరులో అన్నిటికీ పూర్తిగా సెలవు. ఇలాంటి సంప్రదాయం మరెక్కడా




చూడం. ఆదివారాలు మద్యమాంసాలకు పూర్తిగా సెలవు సుబ్బరాయ కొత్తూరులో. అసలు గ్రామంలో మాంసం విక్రయశాల లేదంటే ఆశ్చర్యం కలుగుతుంది. విడి రోజులలో మాంసం కావాలంటే ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న నందివర్గం గ్రామానికి వెళ్లవలసిందే. అలా వెళ్లేవారి సంఖ్య చాలా తక్కువ అని అంటారు.

అదే విధంగా శ్రావణ, కార్తిక, మాఘ మాసాలలో గ్రామస్తులంతా పూర్తిగా శాకాహారులుగా ఉంటారు. వీరి ముఖ్యమైన కర్రిపండుగనాడు మాంసాహారం తినడం ఒక సంప్రదాయం. ఒకవేళ ఆ పండగ ఆదివారం వస్తే మాంసాహారం లేదన్నట్టే.

అంటే ఆదివారాలు, మూడు మాసాలు అన్నీ కలిపితే సుమారు నాలుగున్నర నెలలు వీరు మాంసాహారం జోలికి వెళ్లరన్నమాట. నిజంగా వీరికి ఆ స్వామి పట్ల గల భక్తి విశ్వాసాలకు వందనం చేయవలసిందే!

ఒకవేళ శనివారం రాత్రి లేక ఆదివారం గ్రామంలో ఎవరైనా మరణిస్తే వారి పార్థివ శరీర దహనం సోమవారం చేస్తారు. ఎందుకంటే ఆదివారం సుబ్బరాయ స్వామి దర్శనార్థం వచ్చే వేలాది మంది భక్తులకు ఇబ్బంది కలగకూడదు అన్న ఆలోచనతో.

శ్రీ సుబ్బరాయ స్వామి అన్ని సమస్యలను తొలగించేవానికి భక్తులు విశ్వసిస్తారు. ముఖ్యంగా వివాహం కానివారు, సంతానం లేనివారు ఈ క్షేత్రానికి వస్తుంటారు. భక్తితో నూట ఎనిమిది ప్రదక్షిణాలు చేసి, నువ్వుల చిమ్మిలి, వడపప్పు నివేదన చేసి అభిషేకం చేయించుకొని తమ అభీష్టాలు స్వామికి విన్నవించుకొని వెళతారు.

తమ కోరిక నెరవేరిన తరువాత కొత్త దంపతులైతే స్వామి వారి దర్శనానికి వచ్చి మొక్కు చెల్లించుకుంటారు. సంతానం పొందినవారు పిల్లల పుట్టు వెంట్రుకలు, చెవులు కుట్టించడం లాంటివి ఇక్కడే జరుపుకొంటారు. మంగళ, ఆదివారాలలో భక్తుల రద్దీ చాలా అధికంగా ఉంటుంది.

పక్క రాష్ట్రాల నుండి సైతం భక్తులు వస్తారు. ఒక్క ఆదివారం మూడు వందల నుండి స్వామివారికి అయిదు వందల అభిషేకాలు జరుగుతాయంటే ఎంత మంది భక్తులు వస్తారో ఊహించుకోవచ్చు.

ఈ ఆలయంలో శ్రీ సుబ్రహ్మణ్య షష్ఠి, నాగుల చవితి, పంచమి, శివరాత్రి, దసరా నవరాత్రులు విశేషంగా జరుపుతారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సుబ్రహ్మణ్య క్షేత్రాలలో ప్రత్యేకత కలిగిన సుబ్బరాయ కొత్తూరు ప్రస్తుత నంద్యాల జిల్లాలో నంద్యాలకు ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్నది. నంద్యాల, పాణ్యం, కర్నూలు, బనగానపల్లి నుండి సులభంగా చేరుకోవచ్చు.


## సరదా రచనలకు ఆహ్వానం

**జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి. మీ రచనలు పంపించవలసిన చిరునామా: నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.**

**sunmagvaartha@gmail.com**

# తెలివితేటలు ఎవరి సొత్తు కాదు

డా॥ పులివర్తి కృష్ణమూర్తి

భారతదేశాన్ని పరిపాలించిన చక్రవర్తుల్లో అక్బర్ చక్రవర్తి ప్రసిద్ధులు. ఆయన కొలువులో బీర్బల్ మంత్రిగా వుండేవాడు. బీర్బల్ చాలా తెలివైనవాడు. ఆయనకు సమయస్ఫూర్తి, తెలివితేటలూ విపరీతంగా వుండేవి. పైగా చమత్కారి కూడాను. పాదుషాకు అప్పుడప్పుడు సరదాగా గడపటం అలవాటు. ప్రశ్నలు అడిగి సభికుల నుండి సమాధానాలు రాబట్టేవారు. అయితే అక్బరు ఎన్నో సమస్యలకూ పరిష్కారాలు అందించేవాడు. పాదుషాకు ఎందుకో అక్బర్ బీర్బల్ అంటే ప్రీతి. ఆయన మాట అంటే అంత విశ్వాసం. అయితే సామాన్యంగా ఎక్కడైనా సరే చక్రవర్తులు ఒక వ్యక్తిపై అమితంగా అభిమానాన్ని చూపుతున్నారంటే ఈర్ష్య, అసూయాలు పుట్టడం సహజం. అలాగే బీర్బల్ విషయంలో కూడా జరిగింది. సమయం చూసి బీర్బల్‌ను ఓడించాలనుకున్నారు. తమ శక్తి సామర్థ్యాలను కూడా అక్బర్ చక్రవర్తి ముందు ప్రదర్శించాలనుకుని వేచి వున్నారు మంత్రులూ, సేనాని మిగిలిన సభికులు.

ఒకసారి బీర్బల్ ఏదో పని మీద ఊరు వెళ్లాడు. ఇదే మంచి సమయం అనుకుని, సైన్యాధిపతి చక్రవర్తితో "జహాపనా! అందరికీ మేం ఆనందం చేకూర్చాలనుకుంటున్నాం. మీరు ఎప్పుడూ మమ్మల్ని సంప్రదించరు. బీర్బల్‌తోనే సంప్రదిస్తారు. మాలో కూడా ఎంతో మంది అనుభవజ్ఞులున్నారు. దయచేసి మాకు కూడా మా శక్తిసామర్థ్యాలను నిరూపించుకునే అవకాశం ఇవ్వండి" అని అర్థించారు.

మరునాడు దర్బారులో అక్బర్ పాదుషా ప్రవేశించగానే "బీర్బల్ ఎక్కడ?" అని అడిగారు.

సైన్యాధిపతి లేచి "మహారాజా! బీర్బల్ ఊళ్లో లేడు. కానీ మీరు అడగదలచుకున్న ప్రశ్న మమ్మల్ని అడగండి. మేం మీకు చక్కని సమాధానం ఇస్తాం" అన్నాడు.

మిగిలినవారంతా ఏకగ్రీవంగా "అవును.... అవును.. మేమంతా సిద్ధమే" అన్నారు.

అక్బర్ సరేనన్నాడు. "మీ సమాధానాలన్నీ నాకు సంతృప్తికరంగా వుండాలి సుమా!" అని ముందుగానే హెచ్చరించాడు.

మొదటి ప్రశ్న అడిగాడు... "ఈ ప్రపంచంలో అతి ఉత్తమమైన పుష్పం ఏది?"

సైన్యాధిపతి లేచాడు. "గులాబి పుష్పం మహారాజా" అన్నాడు.

ఇక



తక్కిన వారంతా ఎవరికి తోచినట్లుగా వారు ఏవేవో పుష్పాల పేర్లు చెప్పారు.

అక్బరుకు ఆ సమాధాలేవీ తృప్తినివ్వలేదు.

రెండో ప్రశ్న: "పాలల్లో ఏది శ్రేష్ఠమయినది?" అనడిగాడు.

మరలా అందరూ ఎవరికి వారు ఏవేవో సమాధానాలు ఇచ్చారు.

అక్బరుకు అవేవీ నచ్చలేదు.

"అత్యంత మధురమైనది ఏదీ?" అని మూడో ప్రశ్న వేశాడు.

కొందరు బెల్లం అన్నారు, మరికొందరు తేనె అన్నారు.

ఇంకొందరు పంచదార అన్నారు.

అబ్బే... అవేవీ చక్రవర్తి గారికి నచ్చలేదు.

నాలుగవ ప్రశ్న: "ఏ ఆకు శ్రేష్ఠమైనది?"

మంత్రులు, సైన్యాధిపతి, సభికులూ అందరూ వారికి స్ఫురించిన ఆకుల పేర్లు చెప్పారు.

పాదుషాకు కించిత్ తృప్తి కూడా కలగలేదు.

అదే సమయంలో హఠాత్తుగా బీర్బల్ సభా ప్రవేశం చేశాడు.

చక్రవర్తి వెంటనే "బీర్బల్! ఏది ఉత్తమమైన పుష్పమో చెప్పుకో చూద్దాం!" అన్నా డు.

బీర్బల్ తడుముకోకుండా "పత్తి పుష్పం" జవాబు చెప్పాడు.

"మహారాజా, ఈ పుష్పం నుండి పత్తి, దారం, ఆ తర్వాత వస్త్రమూ లభిస్తాయి. ఈ పుష్పం బహుళార్థ ప్రయోజనకారి. మానవులకు శాశ్వతంగా ఉపయోగపడే పుష్పం ఇది" అంటూ వివరణ ఇచ్చాడు.

"సరే. ఏ పాలు శ్రేష్ఠమైనవి?"

"బిడ్డకు పుష్టినీ, సంతుష్టినీ అందించే తల్లిపాలు" అన్నాడు.

చక్రవర్తి మూడో ప్రశ్న సంధించాడు. "అత్యంత మధురమైనది ఏది?"

"మృదుమధురమైన భాషణం. ఎటువంటి వారినైనా మార్చగల శక్తి ఒక్క మాటలకే వుంది. కాకి అరిస్తే రాయి రువ్వి, తరుముతారు. కోయిల కూస్తే వినడానికి ఇష్టపడతారు" అని జవాబు చెప్పగా–

చక్రవర్తి చివరి ప్రశ్నను కూడా సంధించాడు. "ఏ ఆకు ఉత్తమమైనది?"

వెంటనే బీర్బల్ "తమలపాకు" అన్నా డు.

"భారతీయులకు తమలపాకు అతి శుభప్రదం అయినది, మంగళకరమైనది. అన్ని శుభకార్యాల్లో, ఆరాధనల యందూ తమలపాకునే ఉపయోగిస్తారు. ఇంతటి విశిష్టత వున్న ఆకు తక్కిన ఆకుల్లో లేదు".

ఈ సమాధానాలు చక్రవర్తికి ఎంతో నచ్చాయి. ఆయన బేష్ అనగానే సభికులందరూ ఒక్కసారిగా లేచి హర్షధ్వానాలు గావించారు.

బీర్బల్ తెలివికి ఆశ్చర్యపోయారు. అక్బర్ చక్రవర్తి ప్రతి విషయానికీ బీర్బల్‌నే ఎందుకు సంప్రదిస్తాడో వారికి ఇట్టే అవగతమైంది. తెలివితేటలున్నవారు ఎప్పుడూ గౌరవనీయులే. తెలివితేటలు ఏ ఒక్కరి సొత్తు కాదు.

**వాస్తువార్త**
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్: 9885446501/9885449458




# పెద్దవాడు ఎటువైపు ఉండాలి?



ఎస్.వాగ్దేవి - కోదాడ

ప్రశ్న: మేం ముగ్గురం అన్నదమ్ములం. మా ముగ్గురికీ సరిపడా ఇళ్ల స్థలం వుంది. దానికి దక్షిణం వైపు రోడ్డు వుంది. దక్షిణం వైపుకు ముఖ ద్వారం పెట్టి ఇళ్లు కట్టుకోవచ్చా? కొంత మంది మూడు ఇళ్లు కలిసి వుండకూడదు అంటున్నారు. మేం ముగ్గురు కలిసి మూడిళ్లు కట్టుకోవచ్చా? దక్షిణం వైపు ముఖద్వారాలు పెట్టుకోవచ్చా? ముగ్గురిలో పెద్దవాడు ఏ వైపుకు వుండాలి?

**జవాబు:** మీరు మూడు ఇండ్లు కట్టుకోవడానికి సరిపడా స్థలం వుందంటున్నారు. ఆ స్థలానికి చుట్టూ కాంపౌండ్ గోడలు ప్లాన్ చేసి మధ్యలో మూడు పోర్షన్లు కట్టుకోవచ్చు. ఆ పోర్షన్లని, కాంపౌండు గోడలకి మధ్య తూర్పు కంటే పశ్చిమం; ఉత్తరం కంటే దక్షిణం తక్కువ స్థలాన్ని వదలాలి. దక్షిణ వీధిలోకి దక్షిణ ఆగ్నేయంలో గేటు తెరచి ఆ గేటుని అన్ని పోర్షన్లకి ఉమ్మడి గేటుగా ఉపయోగించే పక్షంలో మూడు పోర్షన్లు కట్టుకోవచ్చు. ఇంటిని పెద్దవాడు పశ్చిమ సరిహద్దుకు దగ్గరగా, మధ్యముడు మధ్యలో, చిన్నవాడు తూర్పు సరిహద్దుకు దగ్గరగా వుండాలి.

## వాస్తు దోషాలున్నాయా?

బి.స్కందన్ - నాయుడుపేట

ప్రశ్న: అనివార్య పరిస్థితుల వల్ల ఇల్లు అమ్మేసాం. ఆ తరువాత మా రెండవ అన్నయ్య పేరుతో లోన్ తీసుకొని మళ్లీ డాబా కట్టాం. అతని జాతకరీత్యా అతనికి ఇల్లు అచ్చి వస్తుందా? లేదా? ఇంట్లో ఏమైనా దోషం ఉందా?

**జవాబు:** జాతక రీత్యా ఒకరికి ఇల్లు పనికిరాదని ఏమీ వుండదు. వాస్తు అందరికీ ఒక్కటే. వాస్తు దోషాలున్నప్పుడు సవరించుకుంటే మంచి ఫలితాలు పొందవచ్చు.

## వంట ఎక్కడ చెయ్యాలి?

ఎల్.వేణుగోపాల్ - కాణిపాకం

ప్రశ్న: దేవుని మూల ఏ విధంగా ఉండాలి? ఎక్కడ ఉండాలి? ఈశాన్యం నుండి ఆగ్నేయం వరకు పూర్వం కట్టిన 'అటక' వుంది. దీనివల్ల లాభ, నష్టాలున్నాయా? వంట ఎక్కడ చేయాలి?

**జవాబు:** దేవునిపూజ ఇంటికి తూర్పునగానీ, తూర్పు ఈశాన్య మూలనగానీ, గోడలోపల షెల్ఫ్‌లో చేయాలి. పెద్ద విగ్రహాలుంటే పశ్చిమ వాయవ్యంలో పూజించాలి.

ఈశాన్యం నుండి ఆగ్నేయం వరకు 'అటక' అంటే అది తూర్పు గోడకు ఏర్పాటవుతుంది. తూర్పు, ఉత్తర గోడలకు అటకలు మంచిది కాదు కనుక తీసేయండి. వంట ఆగ్నేయంలో తూర్పు ముఖంగా నిలబడిగానీ, కూర్చొని గానీ చేయండి.

## మందిరం మెట్లు?

కె.పంకజం - నారాయణపేట

ప్రశ్న: ఉద్యోగరీత్యా నాకు రైల్వే క్వార్టర్ ఇచ్చారు. కొంత కాలం ప్రశాంతంగా గడిచింది. ఈ మధ్య మనశ్శాంతి కరువైంది. వచ్చిన డబ్బు త్వరగా ఖర్చవుతోంది. వంటపొయ్యి పెట్టిన చోట నేను ఈ ఇంట్లోకి రాకముందు ఎవరో దేవుని మెట్లు కట్టారు. నేను వాటిని తొలగించలేదు. వాటిని అలాగే వుంచేయాలా? వద్దా?

**జవాబు:** మీరు ప్రస్తుతం వంట చేస్తున్న స్థలం సరైంది కాదు. అక్కడ వున్న మందిరం మెట్లు మీరు నిస్సంకోచంగా తీసివేయవచ్చు. కానీ పూజ అక్కడే గోడలోకి షెల్ఫ్ తీసి అక్కడ కూర్చొనిగానీ, నిలబడిగానీ చేయండి. పడక గదిలోని బీరువాని నైరుతి మూలకు మార్చండి. మంచి ఫలితాలు వెంటనే కనిపిస్తాయి. వాయవ్యంలో వున్న లెట్రిన్‌ని తీసివేయండి.

## వాస్తు ప్రభావం వల్లనేనా?

సి.ఆశిశ్ - నాగపూర్

ప్రశ్న: పూర్వీకుల నుండి మాకు లభించిన పెంకుటింటిని పూర్తిగా పడగొట్టి డాబా ఇల్లు నిర్మించాం. ఆ ఇల్లు కట్టేవరకు మాకు బాగానే వుంది. కానీ గత సంవత్సరం నుండి మాకు చాలా యిబ్బందిగా వుంటున్నది. ఆదాయం బాగున్నప్పటికీ చేతిలో డబ్బు నిలవడం లేదు. కుటుంబ సభ్యుల ఆరోగ్యం బాగుండటం లేదు. కుటుంబంలో సఖ్యత తగ్గింది. ఇదంతా వాస్తు ప్రభావమేనా?

**జవాబు:** మీ ఇంటికి ఉత్తర ఈశాన్యం పెరిగి వుండటం వలన ఉత్తర ఈశాన్య వీధిపోటు కూడా వుండటం వల్ల మీకు మంచి ఫలితాలే వుండాలి. కానీ మీరు ఇంటికి పశ్చిమ నైరుతిలో సింహద్వారం నిర్మించారు. అలాగే దానికి ఎదురుగా తూర్పు ఆగ్నేయంలో మరో ద్వారం ఏర్పాటు చేసారు. ఇవి మంచి ఫలితాలనివ్వవు.

ఆ రెండు తలుపులు మూసి ఉత్తర ఈశాన్యంలో (ఇప్పుడు స్టడీ రూము) వున్న ద్వారం గుండా వీధిలోకి నడవటం ప్రారంభించండి. తూర్పు గోడను చేర్చి(ఇంట్లో) బెడ్ రూమ్, లెట్రిన్ కట్టారు. అవి దరిద్ర్యానికి దగ్గర తోవట. వాటిని నిర్మూలించి దక్షిణం వైపున బెడ్ రూమ్‌కీ, డైనింగ్ హాలుకీ మధ్యన ఏర్పాటు చేయండి. ఇప్పుడు స్టోర్ రూముగా వాడుతున్న గదిని హాల్లోకి మార్చి, ఆ స్టోర్ రూమును హాలుగా మార్చండి. ఈ మార్పుల వల్ల మీకు ప్రస్తుతం వున్న సమస్యలు చాలావరకు పరిష్కరింపబడతాయి.



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. దూర ప్రాంతాల నుంచి శుభ వార్తలు అందుకుంటారు. విందు-వినోదాలలో పాల్గొంటారు. బంధువులు మీతో కలిసి వ్యాపారం చేయాలని ఆశిస్తారు. అయితే అయినవాళ్లతో కలిసి వ్యాపారం చేయడానికి సుముఖత చూపించరు. వైద్య, విద్యావకాశాలు కలిసి వస్తాయి. కోపాన్ని నియంత్రించుకుంటే మంచిది.

## వృషభం



బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. సన్నిహితులతో అకారణంగా తగాదాలు ఏర్పడవచ్చు. మెలకువ చాలా అవసరం. దైవ సందర్శనం చేసుకుంటారు. మీ ప్రమేయం లేకుండానే కొన్ని శుభ ఫలితాలు చేతికందుతాయి. అరటినార వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయడం శుభప్రదం. కుటుంబ సభ్యులతో కలిసి యాత్రలు చేస్తారు.

## మిథునం



ఆర్థిక పరమైన చిక్కుల నుంచి పూర్తిగా బయట పడలేకపోయినా ఒత్తిడి నుండి బయట పడతారు. సంఘంలో గౌరవం పొందుతారు. రాజకీయ, కళా, పారిశ్రామిక రంగాల వారికి సన్మానాలు పొందుతారు. ప్రజలను ఆకర్షిస్తారు. వాక్చాతుర్యంతో ముఖ్యమైన పనులు చక్కబెట్టుకుంటారు. ఆకస్మిక ధన లాభం పొందుతారు. శుభ కార్యాల్లో పాల్గొంటారు.

## కర్కాటం



మిత్రుల నుంచి శుభ వార్తలు అందుకుంటారు. కొత్త పనులకు శ్రీకారం చుడతారు. కాంట్రాక్టులు లాభిస్తాయి. స్థలాలు కొనుగోలు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగం పట్ల అంకిత భావంతో మెలగుతారు. ఎరుపు వత్తులు, అష్టమూలికా తైలంతో రోజూ దీపారాధన చేయడం మంచిది. కుటుంబ సభ్యులతో కలిసి శుభ కార్యాల్లో పాల్గొంటారు.

## సింహం



ఆలయాలు సందర్శిస్తారు. అనుకోని ఆహ్వానాలు అందుకుంటారు. మధ్యవర్తిత్వానికి దూరంగా వుండటం చెప్పదగిన సూచన. కోర్టు వ్యవహారాలు సానుకూల దిశగా పయనిస్తాయి. చిన్ననాటి మిత్రుల నుండి ఆర్థిక సహాయం అందుకుంటారు. అరటినార వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయడం మంచిది. ముఖ్యమైన చర్చలు ఫలిస్తాయి.

## కన్య



వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. కొత్త ప్రయోగాలు కలిసి వస్తాయి. ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. విద్యా సంస్థలు నడిపే వారికి బాగుంటుంది. సమయస్ఫూర్తితో నిర్ణయాలు తీసుకుని లాభపడతారు. వైద్య, విద్యావకాశాలు కలిసి వస్తాయి. సాహస యాత్రలు చేస్తారు. బాల్య మిత్రులను కలుసుకుంటారు.

## తుల



విశ్రాంతి లేని కార్యక్రమాలు, వ్యవహారాలు, కుటుంబ సమస్యలు చికాకు కలిగిస్తాయి. రాజకీయాల్లో ఉన్నవారు కచ్చితమైన ప్రణాళికలు రూపొందించుకుంటారు. సంతానం, కుటుంబ విషయాలు మధ్యస్థంగా ఉంటాయి. విద్యార్థులు పరీక్షల్లో విజయం సాధిస్తారు. కొత్త అగ్రిమెంట్స్ చేసుకుంటారు. వ్యాపార ప్రదేశాల్లో దైవికం పొడితో ధూపం వేయండి. నర దృష్టి తొలగిపోతుంది. శుభ వార్తలు వింటారు.

## వృశ్చికం



ఆర్థిక లావాదేవీలు అనుకూలంగా ఉంటాయి. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. అనుకోని విధంగా ధన లాభం పొందుతారు. దూర ప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. కొత్త వ్యాపార ప్రయత్నాలు కలిసి వస్తాయి. పెట్టుబడులు సంపాదిస్తారు. కొంత మంది సలహాలు, సూచనలు మీకు అక్కరకు వస్తాయి. ఎరుపు వత్తులు, అష్టమూలికా తైలంతో రోజూ దీపారాధన చేయండి.

## ధనుస్సు



వివాదాలకు దూరంగా వుంటే మరిన్ని మంచి ఫలితాలు సంపాదిస్తారు. కుటుంబ సభ్యులతో కష్టసుఖాలు పంచుకుంటారు. భాగస్వామ్య వ్యాపారాలలో మీ ఆలోచనలు మారతాయి. కలిసి వ్యాపారం చేయాలా, లేదా అన్న నిర్ణయం తీసుకుంటారు. విద్యా సంస్థలు నడిపే వారికి బాగుంటుంది. కోచింగ్ సెంటర్లు నడిపే వారికి అనుకున్న ఫలితాలు లభిస్తాయి. కళాకారులకు ప్రోత్సాహం లభిస్తుంది.

## మకరం



సామాజికంగా ఉన్నత స్థానంలో వున్నవారితో పరిచయాలు ఏర్పడతాయి. ప్రతివారినీ అనుమానాస్పద దృష్టితో చూస్తారు. ఉన్నత విద్య కోసం రుణాలు తీసుకుంటారు. యోగా క్లాసులు నిర్వహించేవారికి డిమాండ్ పెరుగుతుంది. రాజకీయాల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. చిన్న వ్యాపారం ప్రారంభిస్తారు. దూర ప్రాంతాల్లో వున్న ఆత్మీయుల రాక ఆనందం కలిగిస్తుంది. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి.

## కుంభం




ముఖ్యమైన వ్యవహారాల్లో విజయం సాధిస్తారు. సంఘంలో గౌరవం పొందుతారు. కాంట్రాక్టులు లాభిస్తాయి. రాజకీయ పైరవీలు జరిగే అవకాశం ఉంది, అప్రమత్తంగా ఉండండి. వైద్య, విద్యా, సాంకేతిక విద్యలో మంచి మెరిట్ సాధిస్తారు. వ్యాపారస్తులకు అనుకూలం. లక్ష్మీతామర వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయడం మంచిది.


## మీనం




జీవిత భాగస్వామితో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. కొత్త రుణాలు తీసుకోవాలని ఆలోచనలు చేస్తారు. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. రాజకీయాల్లో ఉన్నవారికి పదవులు దక్కుతాయి. కుటుంబ సభ్యులతో కలిసి శుభ కార్యాల్లో పాల్గొంటారు. ఆకస్మిక ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. విద్యార్థులకు శుభ యోగం.

# ఈ వారం కా'ర్టూన్స్'


పోలింగ్ స్టేషన్


నానమ్మా.. నీవు బతికుండగానే నా పెళ్లి జరిపించమని ఇంట్లో నస పెట్టొచ్చు కదా!!?
వర్క్ ఫ్రం హోం


ప్రాణం పోయినా ఓటు అమ్ముకునేది లేదు! మా కులపోడు ఉండనే ఉండె పోటీలో!!



ఫోటో ఫీచర్

పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్న ఈ ఉద్యానవనం కాలిఫోర్నియాలోని ఫ్రెస్నోలో ఉంది. నేలమాళిగలో ఉండటం దీని ప్రత్యేకత. దీనిని ప్రభుత్వం చారిత్రక ప్రదేశంగా గుర్తించింది.



